ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం: 30.0 కనిష్ఠం: 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

మంగళవారం 14 అక్టోబరు 2025

నకిలీ మద్యం వేట

ములకలచెరువు వ్యవహారంతో ఎక్సైజ్ అధికారుల్లో కలవరం

జిల్లాలో విస్తృతంగా తనిఖీలు

నకిలీ మద్యం తయారీపై నిఘా

వివరాలు 6లో...

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ జిల్లా అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 237 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతే ప్రమాణికంగా అర్జీల పరిష్కారం, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఒక సమస్యపై వచ్చిన ఫిర్యాదు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భూవివాదాలు, నూతన పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల కోసం అధికంగా ప్రజల అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈఓ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీసీఓ కృష్ణా నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ

కలెక్టరేట్‌లో దివ్యాంగులకు సోమవారం ల్యాప్‌టాప్‌లు, ఉపకరణాలకు కలెక్టర్ శ్యాంప్రసాద్ పంపిణీ చేశారు. విభిన్నప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్నత చదువులు చదువుతున్న ఇద్దరు దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు, 10 మంది బధిరులకు టచ్‌ఫోన్లు, దివ్యాంగురాలికి వీల్‌చైర్‌ను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరికరాలను సద్వినియోగం చేసుకుని, రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయసంస్థ సంచాలకురాలు అర్చన పాల్గొన్నారు.

కొత్త కొత్తగా..!

- బడిబాట పట్టిన కొత్త టీచర్లు
- తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- జిల్లాకు 260 మంది కేటాయింపు



హిందూపురం ఎంఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన ఉపాధ్యాయులు

హిందూపురం/కొత్తచెరువు/కదిరి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): కొత్త టీచర్లు విధుల్లో చేరారు. డీఎస్సీ-2025లో ఉద్యోగాలు సాధించిన వారు సోమవారం పాఠశాలలకు వెళ్లి రిపోర్ట్ చేసుకున్నారు. ఆయా మండలాల ఎంఈఓల ఆధ్వర్యంలో విధుల్లో చేరారు. వీరికి పాఠశాల విద్యాశాఖ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి పని ప్రదేశాలను కేటాయించిన విషయం తెలిసిందే. కొత్త గురువుల రాకతో జిల్లాలో జిల్లాలోని మారుమూల పల్లెల్లోని పాఠశాలల్లో బోధనా సమస్యలు తీరుతాయని పలువురు పేర్కొంటున్నారు. డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఎనిమిది రోజులపాటు హిందూపురంలోని బిట్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. జోనల్ పోస్టులకు ఎంపికైన వారికి మరోచోట శిక్షణ ఇప్పించారు. వారికి వెబ్ కౌన్సెలింగ్ ఇచ్చి పాఠశాలలను కేటాయించారు. దీనివల్ల చాలా చోట్ల ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

బదిలీ ఉపాధ్యాయులకు ఊరట

గతంలో సాధారణ బదిలీల్లో కొంతమంది ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ పాతచోటే కొనసాగుతున్నారు. పాత స్థానంలోకి సబ్జెక్ట్ టీచర్ రాకపోవడంతో యథావిధిగా పనిచేయాల్సి వచ్చింది. కొత్తగా నియమించిన ఉపాధ్యాయులు రావడంతో బదిలీ ఉపాధ్యాయులకు కేటాయించిన స్థానాల్లో చేరడానికి ఆస్కారం ఏర్పడనుంది.

జిల్లాకు 260 మంది: కిష్టప్ప, డీఈఓ

నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలలో సోమవారం నుంచే విధుల్లోకి చేరాలి. అందరికీ పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చాం. మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. జిల్లాకు 260మందిని కేటాయించారు. అయితే వీరిలో ఎస్జీటీలు ఎంతమంది ఎస్ఏలు ఎంతమంది అని తెలియాల్సి ఉంది.

జిల్లాలో సబ్జెక్టు టీచర్ల నియామకం వివరాలు..

సబ్జెక్టు	టీచర్ల సంఖ్య
ఇంగ్లిష్	52
హిందీ	12
తెలుగు	5
ఉర్దూ	2
బయాజికల్ సైన్స్	15
గణితం	18
ఫిజికల్ ఎడ్యుకేషన్	56
ఫిజికల్ సైన్స్	23
సోషియల్ స్టడీస్	46
ఎస్‌జీటీలు	27
ఎస్‌జీటీలు	
ఉర్దూ మీడియం	4



కదిరిలో కొత్త టీచర్లను అభినందిస్తున్న కందికుంట

టీచర్లను అభినందించిన ఎమ్మెల్యే

మెగా డీఎస్సీ-2025లో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన వారిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభినందించారు. స్థానిక వీవర్స్ కాలనీ మునిసిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యయ పోస్టులు సాధించిన టీచర్లను ఎమ్మెల్యే సోమవారం కలిసి అభినందించారు. ఎన్నికలలో చెప్పిన విధంగా ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించి 150 రోజులలోనే ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. దాదాపు 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూపురంలోని ఎంజీఎం క్రీడామైదానం వద్ద 15రోజుల క్రితం ఉదయం 7 గంటల సమయంలో బైక్ పార్క్‌చేసి గ్రౌండ్‌లో వాకింగ్ చేసి తిరిగి వచ్చేసరికి వాహనం మాయమైంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. పట్టణంలోని స్టేషన్‌లో మీ వాహనాలకు మీరు జాగ్రత్త లేకపోతే ఎలా అన్నారు. దీంతో ఫిర్యాదు ఇవ్వకుండానే వెనుదిరిగి వెళ్లారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో అంబేడ్కర్ సర్కిల్‌లో ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి వస్తువులు కొనుగోలు చేసి వచ్చేసరికి బండి మాయమైంది. బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నిరాకరించాడు.

నెలక్రితం పెనుకొండలోని ఆర్డీఓ కార్యాలయం సమీపాన గోరంట్ల ప్రాంతానికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనాన్ని ఆపి, పని చూసుకుని అరగంట తరువాత తిరిగి వచ్చి చూడగా.. కనిపించలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్తే రికార్డులు తీసుకురమ్మన్నారు. నాలుగు రోజుల తరువాత వచ్చాడు. ఇన్నిరోజుల తరువాత వచ్చి ఫిర్యాదు చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. పోలీసుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వెళ్లిపోయారు.

రెండు నెలల క్రితం మడకశిరలోని ప్రైవేటు బస్టాండు వద్ద కర్ణాటకకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాల్లో వచ్చి అక్కడ పార్క్‌చేసి హోటల్‌లో భోజనం చేసి బయటకి వచ్చేసరికి ద్విచక్రవాహనాల్లేవు. వారు కూడా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా.. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వెనుదిరిగారు. ఇది కేవలం పై నలుగురిదేకాదు.. వందలాది మంది బాధితుల ఆవేదన. కర్ణాటకకు ఆనుకుని జిల్లా ఉండటంతో ఇక్కడ వాహనాలు అపహరించి, కర్ణాటకకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. అక్కడ వాహనాలను చోరీ చేసి, జిల్లాలో అమ్ముతున్నారు.

కేసులు కట్టకుండా సాకులు..!





- జిల్లాలో పెరిగిన ద్విచక్రవాహన చోరీలు
- పోలీసు స్టేషన్‌కు వెళ్తే ఫిర్యాదిదారులకే ప్రశ్నలు
- ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా జాప్యం
- విసిగిపోతున్న బాధితులు
- ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్న వైనం
- వందల్లో చోరీ అవుతున్నా..
- పదుల సంఖ్యలోనే కేసులు

హిందూపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కార్యాలయాలు, ఇళ్లముందు బైక్ పార్క్‌చేసి తిరిగి వచ్చేసరికి అక్కడ ఆ వాహనం ఉంటుందని చెప్పలేని పరిస్థితి. ద్విచక్రవాహనం కనిపించడంలేదని పోలీసు స్టేషన్‌కు వెళితే.. వెంటనే కేసు నమోదు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. ఎక్కడైనా దొంగ దొరికితే ఆగమేఘాలపై కేసు నమోదు చేస్తున్నారు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో రెండేళ్లలో వందల సంఖ్యలో ద్విచక్రవాహనా లు చోరీ అయ్యాయి. కేసుల నమోదు అంతంత మాత్రమేనని బాధితులు వాపోతున్నారు. పైగా బాధితులపైనే ప్రశ్నలు వేసి, బెదరగొడుతున్నట్లు తెలుస్తోంది. పలు ర కాల సాకులు చెప్పి, పంపుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

ఎందుకు జాప్యం?

బండిపోయిందని బాధితులు చెప్పిన వివరాలతో కేసు నమోదు చేయరు. కొన్నిరోజులు తిప్పించుకున్న తరువాతే ఫిర్యాదులు పరిశీలిస్తారు. ఈలోగా స్టేషన్ చుట్టూ తిరిగినా పట్టించుకోరు. ఏదైనా కేసు నమోదైతే వెంటనే పరిష్కరించాలి. వివరాలను క్రైం సమీక్షలో వెల్లడించాలి. కేసు నమోదు కాకపోతే సమీక్షలో చెప్పాల్సిన అవసరం ఉండదనే ఆలోచనతో పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో బండి దొరికితే కేసు తీసుకుని రికవరీ చేస్తారు. లేదంటే బాధితుడికి సాకులు చెప్పి, వాపసు పంపడం సర్వసాధారణం.

రికవరీలో జాప్యం

కర్ణాటక సరిహద్దులో జిల్లా ఉండటంతో ద్విచక్రవాహనాల చోరీలు అధికంగా అవుతున్నాయని తెలుస్తోంది. గతంలో ద్విచక్రవాహన దొంగలపై ఓ కన్నేసి ఏడాదిలో కనీసం నాలుగైదుసార్లు రికవరీ చూపేవారు. మూడేళ్లుగా రికవరీలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జిల్లాలో దొంగలు దొరకడం లేదో.. లేక వారిని పట్టుకోవడంలో చొరవ చూపట్లేదో.. పోలీసులకే ఎరుక. కొన్ని స్టేషన్లలో ఒక్క కేసు కూడా లేదంటున్నారంటే అక్కడ అపహరణ జరగలేదా.. జరిగినా కేసు నమోదు చేయలేదా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది. వందల్లో చోరీ అయినా పదుల సంఖ్యలో ఫిర్యాదులు వెళ్లడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు.

ముందుకురాని బాధితులు

ఇటీవల వాహనాలు అధికంగా చోరీ అవుతున్నా చాలామంది బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడంలేదు. ఇందులో కొంతమంది వాహనాలకు సంబంధించిన రికార్డులు లేకపోవడం, మరికొంతమంది ఫిర్యాదు చేసినా రికవరీ కాదులే.. అన్న భావనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దొంగలు పేట్రేగిపోతున్నారు. నిత్యం జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో ద్విచక్రవాహనాలు ఎత్తుకెళ్తున్నారు. ఒకప్పుడు జిల్లాలో ఎక్కడైనా ద్విచక్రవాహనం చోరీ అయితే అన్ని పోలీసు స్టేషన్లలో సిబ్బంది అలర్ట్ అయ్యేవారు. ప్రస్తుతం ఒకే ఊరిలో ఒకేరోజు నాలుగైదు వాహనాలు పోయినా పోలీసులు మాత్రం పెద్దగా స్పందించట్లేదన్న చర్చలు వినిపిస్తున్నాయి. దీంతో బాధితులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ఇష్టపడటంలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రత్యేక చొరవ చూపుతాం: సతీష్‌కుమార్, ఎస్పీ



ద్విచక్రవాహన చోరీలను అరికట్టడానికి ప్రత్యేక చొరవ చూపుతాం. ద్విచక్రవాహనదారులు జీపీఎస్ అమర్చుకుంటే చోరీలను నియంత్రించవచ్చు. వాహనాలను గేటులోపల భద్రపరిచి వీల్‌లాక్ ఏర్పాటు చేసుకోవాలి. త్వరలోనే జిల్లావ్యాప్తంగా ద్విచక్రవాహన చోరీల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రంలో పండుగ

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురంలో జీఎస్టీ 2.0పై ర్యాలీ



జీఎస్టీ 2.0 ర్యాలీలో పాల్గొన్న జనం

హిందూపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రం పండగ జరుపుకుందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. జీఎస్టీ 2.0 పేరిట హిందూపురం చిన్నమార్కెట్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. వేలాది మంది మహిళలు, విద్యార్థులు ర్యాలీలో భాగస్వాములయ్యారు. అంతకు మునుపు బట్టల దుకాణం, కిరాణం దుకాణం, ఐరన్ మార్ట్‌లోకి వెళ్లి జీఎస్టీ తగ్గింపు తరువాత వ్యాపారులకు, వినియోగదారులకు మేలు జరిగిందా అని అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఓ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు జీఎస్టీ తగ్గింపు ఫలాల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గించడంతో అందరికంటే ఎక్కువగా రోగులకు మేలు జరుగుతోందని అన్నారు. క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా.. క్యాన్సర్ మందులపై జీఎస్టీని తొలగించడాన్ని హర్షిస్తున్నానన్నారు. గతంలో పలురకాల పన్నులు ఉండేవని, ఎన్డీఏ ప్రభుత్వం వాటన్నింటిని ఒకే గూటికి తెచ్చి, జీఎస్టీగా మార్చిందని అన్నారు. జీఎస్టీ వల్ల ప్రభుత్వ ఆదాయం పెరిగిందని, ఆ ఫలాలను ప్రస్తుతం ప్రజలకు పంచుతున్నారని అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రానికి రూ.8 వేల కోట్ల నష్టం జరుగుతోందని, అయినా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోందని అన్నారు.

బాలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి..

హిందూపురం మండలం కె బసవనపల్లి వద్ద తారు రోడ్డును ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం ఆయన తిరిగి వెళ్లేందుకు వాహనం ఎక్కుతుండగా.. అభిమానులు 'బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి' అని ప్లకార్డులు ప్రదర్శించారు. పార్టీకి 40 ఏళ్లుగా సేవ చేస్తున్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించి బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాటిని చూసిన బాలకృష్ణ.. నవ్వుతూ వాహనమెక్కి ముందుకు కదిలారు.

నూతన జేసీ బాధ్యతల స్వీకరణ



మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్ సోమవారం కలెక్టర్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన జేసీ మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. గతంలో ఇక్కడ జేసీగా పనిచేస్తున్న అభిషేక్ కుమార్‌ను ఏపీ మారిటైమ్ బోర్డు సీఈఓగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో భరద్వాజ్ బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వాలు సిగ్గుపడాలి

ఐద్వా అఖిల భారత ప్రధాన కార్యదర్శి మరియం ధావలే



వేలాదిమందితో భారీ ర్యాలీగా వస్తున్న ఐద్వా మహిళలు

అనంతపురం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పురుషులతో మహిళలకు సమాన హక్కులు కల్పించలేని ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలని ఐద్వా అఖిల భారత ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలకు సోమవారం అనంతపురంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి క్లాక్‌టవర్ కూడలి మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాదిమంది మహిళలు ఐద్వా జెండాలు, ఐద్వా పోరాటయోధుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. 16వ మహాసభల సూచికగా 16 పెద్ద జెండాలతో కార్యకర్తలు ఉరుము కళాకారుల విన్యాసాలు, కోలాట ప్రదర్శనల నడుమ కదిలారు. అనంతరం లలితకళా పరిషత్‌లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన సభను (మిగతా 6లో...)

యుద్ధప్రాతిపదికన..

- హంద్రీనీవా కాలువ గండ్ల పూడ్చివేత పనులు



మణూరు తండా వద్ద చేస్తున్న గండి పూడ్చివేత పనులు

మడకశిర, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పథకంలోని మడకశిర ఉప కాలువకు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చి వేస్తున్నారు. ఇప్పటికే ఒకదానిని పూడ్చి వేశారు. మరో రెండింటి పనులు శరవేగంగా సాగుతున్నాయి. కాలువకు మంగళవారం నీటిని విడుదల చేయనున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కాలువకు వారం రోజుల క్రితం నీటిని వదిలారు. ఇప్పటికే మడకశిర మండలం మణూరు చెరువు 80 శాతం నిండింది. రెండురోజుల క్రితం కురిసిన భారీవర్షాలకు కాలువలో నీటి ఉధృతి పెరిగి మూడుచోట్ల గండ్లు పడ్డాయి. హిందూపురం పరిధి పోచనపల్లి, మడకశిర మండలం నల్లనాయినిపల్లి, మణూరు తండా వద్ద కాలువకు గండ్లు ఏర్పడ్డాయి. వెంటనే కాలువకు నీటి సరఫరాను ఆపేశారు. అధికారులు యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చే పనులు చేపట్టారు. పోచనపల్లి వద్ద పడిన గండిని పూడ్చేశారు. నల్లనాయినపల్లి వద్ద గండిని పూడ్చే పనులు 90శాతం పూర్తయ్యాయి. మణూరు తండా వద్ద పడిన గండిని రెండ్రోజుల్లో పూడ్చనున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కాలువకు మంగళవారం నీటి సరఫరాను పునరుద్ధరించనున్నారు. నీరు మడకశిరకు చేరుకునేలోగా గండ్లను పూడ్చి వేస్తామని పేర్కొంటున్నారు.

ధర్మవరం బాలికలు భళా..!

ఫ్లోర్‌బాల్ అంతర్జాతీయ పోటీలకు ఎంపిక
నవంబరులో సింగపూర్‌కు విద్యార్థినులు
మున్సిపల్ పాఠశాల బాలికలకు ఆర్థిక కష్టాలు


సింగపూర్‌లో నిర్వహించే పోటీలకు ఎంపికైన ధర్మవరం విద్యార్థినులు

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు ధర్మవరం బాలికలు. అరకొరగా ఉన్న సౌకర్యాలనే అందిపుచ్చుకు అద్భుత ప్రతిభా పాటవాలు కనబరుస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో ఫ్లోర్‌బాల్ క్రీడల్లో అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. మొదట రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సంపాదించి.. అక్కడ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అక్కడ కూడా సత్తాచాటి ఏకంగా సింగపూర్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు జాతీయ జట్టులో 10 మంది చోటు సంపాదించుకున్నారు.

ఇదీ ఫ్లోర్‌బాల్ క్రీడా నేపథ్యం..

ఫ్లోర్‌బాల్ క్రీడలో మొత్తం 11 మంది ఉంటారు. క్రీడలో ఆడేవారు ఆరుగురు ఉండగా.. మిగిలిన ఐదుగురు అదనంగా ఉంటారు. ఈ ఆటకు 30 నిమిషాలు కేటాయిస్తారు. ఇందులో ఎక్కువ గోల్స్ చేసిన జట్టును విజేతగా నిర్ణయిస్తారు. ఈ క్రీడ ఇండోర్ స్టేడియంలో ఆడతారు.

అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ

ఈ క్రీడకు ధర్మవరం ప్రాంతంలో పెద్దగా ప్రాధాన్యం లేదు. కొన్ని నెలల నుంచి ఈ క్రీడకు బీఎస్ఆర్ మున్సిపల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రాధాన్యం ఇచ్చి బాలికలను ప్రోత్సహించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలతోనే శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం, పీఈటీ, పీడీలు ప్రత్యేక దృష్టి సారించి బాలికలకు ప్రతిరోజూ ఫ్లోర్‌బాల్ ఆటలో మెలకువలు నేర్పించారు. దీంతో మూడునెలల కాలంలోనే బాలికలు మంచి ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఆగస్టు మొదటి వారంలో అనంతపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ధర్మవరానికి చెందిన 20 మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తర్వాత గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సత్తాచాటి.. జాతీయస్థాయి పోటీలకు 13 మంది ఎంపికయ్యారు. వీరు బిహార్‌లో సెప్టెంబరు 1నుంచి 10వతేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఇందులో కూడా సత్తాచాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున 10 మంది ఎంపికయ్యారు. వీరు నవంబరులో సింగపూర్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారు. సింగపూర్‌కు వెళ్లడానికి ఒక్కో బాలికకు రూ.2లక్షల దాకా ఖర్చు అవుతుంది. ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ తరపున రూ.50వేలు ఇస్తారు. మిగిలిన మొత్తం తల్లిదండ్రులు లేదా దాతల సహకారంతో డబ్బులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మున్సిపల్ స్కూలులో చదువుతున్న ఈ చిన్నారులకు ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. పాస్‌పోర్టు కోసం ఈనెల 30,31తేదీలలో బాలికలు విజయవాడ వెళ్లనున్నారు. నవంబరు మొదటి వారంలో 10 రోజుల పాటు ఢిల్లీలో ఫ్లోర్‌బాల్ క్రీడలో శిక్షణకు వెళ్లనున్నట్టు పీఈటీ తెలిపారు.

పీఈటీ కృషి ఎనలేనిది

ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ కనుముక్కల లక్ష్మీనారాయణ బాలికల విజయానికి చేసిన కృషి ఎనలేనిది. ఆయన తాడిపత్రి నుంచి బదిలీపై జూన్‌లో ధర్మవరం వచ్చారు. ఫ్లోర్‌బాల్‌పై బాలికలకు ఉన్న మక్కువ చూసి ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా క్రీడను ఎలా ఆడాలో చూపించి శిక్షణ ఇచ్చారు. పాఠశాలలో ఈ క్రీడకు కావాల్సిన ఆట వస్తువులు లేవు. దీంతో పీఈటీ తన సొంత ఖర్చులతో బ్యాట్లు, బాల్లు ఇతర వస్తువులను కొనుగోలు చేసి శిక్షణ ఇచ్చారు.

అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణిస్తారు



నేను ఈ ఏడాది జూన్‌లో సాధారణ బదిలీల్లో తాడిపత్రి నుంచి ధర్మవరం పీఈటీగా వచ్చా. విద్యార్థినిలకు ఏ క్రీడలపై మక్కువ ఉందో తెలుసుకున్నా. పాఠశాలలో ఐపీబీ ప్యానల్ ద్వారా ఫ్లోర్‌బాల్ క్రీడ ఎలా ఆడాలో చూపించి క్రీడా సామాగ్రిని సమకూర్చి నేర్పించా. దీంతో నేరుగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్లా. అక్కడ ప్రతిభ కనబరచి ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున మా పాఠశాల నుంచే 10 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. అంతర్జాతీయ పోటీల్లో కూడా సత్తాచాటి పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తారని ఆశిస్తున్నా.

-కనుముక్కల లక్ష్మీనారాయణ, పీఈటీ, బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ధర్మవరం

అంతర్జాతీయ పతకమే లక్ష్యం



నేను 9వ తరగతి చదువుతున్నా. ఫ్లోర్‌బాల్ క్రీడ టీవీల్లో చూడమే కానీ ఎప్పుడూ ఆడలేదు. ఈ ఏడాది మా పాఠశాలకు బదిలీపై వచ్చిన పీఈటీ లక్ష్మీనారాయణ సార్ ప్రోత్సాహంతో తక్కువ కాలంలో ఫ్లోర్‌బాల్ ఆట నేర్చుకున్నా. సింగపూర్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యా. అంతర్జాతీయ పతకం సాధించడమే నా లక్ష్యం.

-బండారు కీర్తన, 9వ తరగతి

ఫ్లోర్‌బాల్ క్రీడ అంటే ఇష్టం



ఫ్లోర్‌బాల్ క్రీడ అంటే చాలా ఇష్టం. పాఠశాలలో ఇంతకు ముందెన్నడూ ఆడలేదు. ప్రస్తుతం ఐపీబీ ప్యానల్ ద్వారా పీఈటీ లక్ష్మీనారాయణ సార్ శిక్షణ ఇచ్చారు. నేరుగా ఆగస్టులో గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటా. తరువాత బిహార్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ సత్తాచాటి మా పాఠశాలకు పేరుప్రతిష్టలు తీసుకువస్తా.

-నందిని, 9వ తరగతి

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా



నేను 9వ తరగతి చదువుతూనే క్రీడలకు సమయాన్ని కేటాయిస్తున్నా. ఫ్లోర్‌బాల్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించా. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం. ఈ క్రీడలో పీఈటీ లక్ష్మీనారాయణ సార్ కృషి ఎంతో ఉంది. ఆయన సొంత ఖర్చులతో మాకు కావాల్సిన బ్యాట్లు, బాల్లు తదితర వాటిని సమకూర్చారు. ఆయన ఆశయం మేరకు అంతర్జాతీయ పోటీల్లో కూడా రాణిస్తాం.

-గౌతమి, 9వ తరగతి

గ్రేడ్ల కుదింపుతో ఉద్యోగోన్నతులు

● బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత


సీఎం, డీసీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఐదు నుంచి నాలుగు గ్రేడ్లుగా కుదింపుతో పంచాయతీ కార్యదర్శులకు ఒకేసారి ఉద్యోగోన్నతి కల్పించే అవకాశం ఉంటుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పంచాయతీ గ్రేడ్ల కుదింపుపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల కోరిక మేరకు నాలుగు గ్రేడ్లుగా కుదించారని, దీనివల్ల పాలన సౌలభ్యం కలగడంతోపాటు ఉద్యోగోన్నతులు కూడా త్వరగా వస్తాయన్నారు. పెనుకొండ, పరిగి మండలాలకు చెందిన పలువురికి మంత్రి సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, సూరి, గిరి, నాగార్జున, నారాయణస్వామి పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక

మంత్రి సవిత సమక్షంలో ఎనిమిది మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాకప్పి ఆహ్వానించారు. వీరంతా పరిగి మండలం పి.నర్సాపురం పంచాయతీలోని ఎస్.కొత్తపల్లి, బీరేపల్లి గ్రామాలకు చెందిన వారు.

అర్చక సమస్యల పరిష్కారానికి కృషి

దేవదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి
ఏపీ అర్చక సమాఖ్య జిల్లా కమిటీ ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల రెడ్డి

అనంతపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అర్చకుల సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయ కల్యాణ మండపంలో ఏపీ అర్చక సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలరెడ్డి మాట్లాడుతూ... పలువురు అర్చకులకు తల్లికి వందనం పడలేదని తన దృష్టికి వచ్చిందన్నారు. సమస్యను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి తల్లికి వందనం వర్తించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం రూ.5వేలు ఉన్న డీడీఎన్ఎస్‌ను రూ.10వేలకు పెంచి అర్చక పురోహితుల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. అనంతరం ఏపీ అర్చక సమాఖ్య జిల్లా నూతన కమిటీ ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఫుల్లమాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా హనుమంతరాముడు, సహాయ కార్యదర్శులుగా తిమ్మరాజు, కడప మధుసూదన్, సంయుక్త కార్యదర్శిగా మారుతి, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్, బాలాజి, పవన్‌కుమార్, గౌరవ సలహాదారులుగా అనిల్‌కుమార్, మహేష్‌శర్మ, మురళి, ఉసేనప్ప, రాము, పామిడి రాములతోపాటు మొత్తం 30 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎం పిక చేశారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షులు పూజా రి భీమప్ప, పార్థసారధి, గరుడాచార్యులు, ద్వారకానాథాచార్యులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి: ఎస్పీ


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా సత్వర న్యాయం చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదిదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా భావించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ సమస్యలపై 75 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశువులు రాకుండా కంచె

అనిమల్ ట్రాక్ పాసింగ్‌తో ప్రమాదాలు
ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్ రెడ్డి


పవన్‌కుమార్ రెడ్డి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపైకి పశువులు రాకుండా కంచె ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. అనిమల్ ట్రాక్ పాసింగ్‌తో పెనుప్రమాదాలు జరుగుతాయని వివరించారు. రైలు పట్టాలు తప్పే అవకాశం కూడా ఉండవచ్చు అన్నారు. సోమవారం అనంతపురం రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆర్పీఎఫ్ స్టేషన్‌లో ఆయన పలు విషయాలను వెల్లడించారు. ప్రధానంగా పశువుల ట్రాక్‌పాస్ ద్వారా చాలా ప్రమాదం అన్నారు. రైల్వేట్రాక్ పరిసర ప్రాంతాల్లో పచ్చిక ఉండటం, తినడానికి వచ్చిన ఆవులు, గేదెలు ప్రమాదవశాత్తూ మృత్యువాత చెందుతున్నాయన్నారు. ఈ మధ్య ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ఆవులను, గేదెలను పాలు పిండుకున్న తరువాత మేతకోసం రైల్వే ట్రాక్ సమీప ప్రాంతాలకు తోలుతుండటంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొందని అన్నారు. రైలు వచ్చే సమయంలో ట్రాక్ దాటుతుండటంతో ప్రమాదవశాత్తు ఢీకొని మృతిచెందుతున్నాయన్నారు. ఇలాంటి సందర్భంలో రైలు పట్టాలు తప్పి ప్రమాదం చోటు చేసుకొనే అవకాశం ఉందన్నారు. దీంతో జిల్లా కేంద్ర పరిసర ప్రాంతాలైన రైల్వే స్టేషన్ నుంచి రాజీవ్ కాలనీ బ్రిడ్జి వరకు.. అటు ప్రసన్నాయపల్లి గేట్ వరకు జంతువులు ట్రాక్ వైపు రాకుండా కంచె ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పశువుల యజమానులు ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో జంతువులను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడటంతో పాటు రైల్వే నిబంధనల మేరకు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

న్యాయవ్యవస్థ సమస్యలకు పరిష్కారం వెతకాలి

ప్రముఖ న్యాయవాది తీస్తా సెతెల్వాద్



సెమినార్‌లో మాట్లాడుతున్న తీస్తా సెతెల్వాద్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థ సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకాలని ప్రముఖ న్యాయవాది, రచయిత, సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ పేర్కొన్నారు. ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమాన్ని జడ్పీ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరమాసప్ప అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, రచయిత, సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వీటికి పరిష్కారమార్గాలు ఏమిటన్నది పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కిందిస్థాయి కోర్టుల్లోనే పరిష్కారం కావాల్సిన చాలా కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు తీసుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. కోర్టుల్లో పని చేసే న్యాయవాదులనే జడ్జిలుగా ఎన్నుకోవడం ద్వారా కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. హక్కుల కోసం పోరాడే వారిపై కేసులు బనాయించడం. చిన్న చిన్న కేసులకు సైతం బెయిల్ రాకుండా కాలయాపన చేస్తుండటం ప్రస్తుతం చూస్తున్నామన్నారు. న్యాయవ్యవస్థలో దళిత, గిరిజనులతో పాటు మహిళల భాగస్వామ్యం బాగా తగ్గిపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ఆల్‌ఇండియా బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సతీష్, పలువురు ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురంరూరల్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 67టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నకిలీ మద్యం వేట

ములకలచెరువు వ్యవహారంతో ఎక్సైజ్ అధికారుల్లో కలవరం
జిల్లాలో విస్తృతంగా తనిఖీలు
నకిలీ మద్యం తయారీపై నిఘా


కిరెకెరలోని మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఈఎస్

పుట్టపర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పక్కనే ఉన్న అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ వ్యవహారం ఇటీవల వెలుగుచూడడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో నకిలీ మద్యం వేట మొదలెట్టారు. మద్యం దుకాణాలు, బార్లలో తనిఖీలు ముమ్మరం చేశారు. ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంతో జిల్లాకి సంబంధాలున్నాయా, తయారీలో ఎవరి పాత్రయినా ఉందా.. అన్న కోణాల్లో ఎక్సైజ్ అధికారులు బృందాలుగా ఏర్పడి, తనిఖీలు చేపడుతున్నారు. నకిలీ మద్యం వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయడంతో జిల్లాలో ఎక్సైజ్ శాఖ అప్రమత్తంది. మద్యం దుకాణాల్లో మద్యం లేబుళ్లు, నిల్వలు, అమ్మకాలపై తనిఖీలు చేపడుతున్నారు. శాంపిళ్లు సేకరిస్తున్నారు. ప్రధానంగా ములకలచెరువు సమీప మండలాలైన కదిరి, తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, నంబులపూలకుంట, అమడగూరు మండలాల్లో బార్లు, మద్యం దుకాణాలతోపాటు బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నారు. కొన్ని బెల్ట్ దుకాణాల్లో చీప్ లిక్కర్‌ను బ్రాండెడ్ బాటిళ్లలో పోసి, విక్రయిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో గుర్తించినట్లు తెలుస్తోంది. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు దారులున్న నేపథ్యంలో అడ్డుకట్ట వేసేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. ఆరునెలల క్రితం హిందూపురంలో తొలిసారిగా నకిలీ మద్యం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. పదిరోజుల క్రితం ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ గుట్టు రట్టవడంతో జిల్లాపై ఎక్సైజ్ శాఖ రాష్ట్ర అధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో తనిఖీలు విస్తృతంగా చేస్తున్నారు. జిల్లాలో 87 ప్రైవేటు, తొమ్మిది కల్లుగీత కార్మికుల మద్యం దుకాణాలతో కలిసి 96 ఉన్నాయి. 11 బార్ అండ్ రెస్టారెంట్లను మంజూరు చేసింది. ఈసారి కొందరు రాజకీయ నాయకులు మద్యం వ్యాపారుల అవతారం ఎత్తారు. దీంతో ఎక్సైజ్ శాఖ ప్రేక్షక పాత్ర వహించాల్సి వస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ వెనుక రాజకీయ మూలాలున్న నేపథ్యంలో జిల్లాలో ఇద్దరు పెత్తనంతో నడుస్తున్న వాటిలో నకిలీ మద్యం విక్రయిస్తున్నారా.. అన్న కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారను. గతంలో నకిలీ మద్యంతో పట్టుబడినవారి కదలికలపై నిఘా పెట్టారు. ఇటీవల తనకల్లు మండలం ఎర్రబల్లికి చెందిన వడ్డే శ్రీరాములు మానసిక రుగ్మతతో బాధపడుతూ వీధుల్లో తిరుగుతూ మరణిస్తే.. మద్యం సేవించి చనిపోయినట్లు వైసీపీ ప్రచారం చేయడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు

ములకలచెరువు నకిలీ మద్యం తయారీ లింకులు జిల్లాలో బయటపడకపోయినా విస్తృతంగా తనిఖీ చేస్తున్నాం. సమీప మండలాల్లోని మద్యం దుకాణాల్లో తనిఖీ చేసి, శాంపిళ్లు సేకరించాం. కర్ణాటక సరిహద్దుల్లోని చెక్‌పోస్టులతోపాటు మద్యం అమ్మకాలపై నిఘా పెట్టాం.

-గోవిందునాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్)

పత్తికి మద్దతు ధర: జేసీ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ తెలిపారు. సోమవారం కర్నూలు పర్యటనలో ఉన్న జేసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... నోటిఫైడ్ చేసిన మార్కెట్ కమిటీలలో పత్తి కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు మధ్య రకం రూ.7,710, పొడవు పింజ రకం రూ.8,110 లభిస్తుందన్నారు. తేమ 8 శాతం లేక అంతకంటే తక్కువ నుంచి 12 శాతం వరకు మాత్రమే ఉండాలన్నారు. 8 శాతం నుంచి 12శాతం వరకు పెరిగిన ప్రతి ఒక్క శాతానికి ఒక శాతం చొప్పున మద్దతు ధరలో తగ్గింపు ఉంటుందన్నారు. 12 శాతం కంటే ఎక్కువ వచ్చిన పత్తిని కొనుగోలు చేయరని అన్నారు. రైతులు తప్పనిసరిగా వాడుకలో ఉన్న వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ నెంబర్లతో అనుసంధానం చేసుకోవాలన్నారు. తాడిపత్రి మార్కెట్‌యార్డు కార్యదర్శి ఫోన్ నెంబర్-9182361482, గుత్తి మార్కెట్‌యార్డ్ కార్యదర్శి - 9182361475ను రైతులు సంప్రదించాలని సూచించారు. వీసీలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో వీసీలో మాట్లాడుతున్న జేసీ

ప్రభుత్వాలు సిగ్గుపడాలి


సంఘీభావం తెలుపుతున్న ఐద్వా మహిళలు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సభకు మరియం ధావలేతోపాటు ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు శ్రీమతి టీచర్, కోశాధికారి పుణ్యవతి, సామాజికవేత్త తీస్తా సెతల్వాద్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

కేంద్రం విధానాలను ప్రశ్నించలేని సీఎంలు

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే మాట్లాడుతూ తమ మద్దతుతో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా, వారి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించలేని స్థితిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఉన్నారని విమర్శించారు. ఆహార భద్రత, ఉపాధి భద్రతకు నిధుల కోసం కేంద్రాన్ని గట్టిగా అడగలేని స్థితిలో వారిద్దరూ ఉన్నారని మండిపడ్డారు. ఉపాధి నిధులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనంతరం తీస్తా సెతల్వాద్ మాట్లాడుతూ మహిళా హక్కులను హరిస్తున్న తాలిబన్ ప్రభుత్వాన్ని ఇక్కడికి ఆహ్వానించి, మీడియా సమావేశంలో కూడా మహిళా జర్నలిస్టులకు అవకాశం లేకుండా చేయడం సిగ్గు చేటన్నారు. కార్పొరేట్ చేతుల్లోఉన్న సోషల్ మీడియా ప్రజల మధ్య విద్వేషాన్ని రగిల్చే సాధనంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

76 ఏళ్ల తర్వాత కూడా పోరాటమే

ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం కూడా సమానత్వం కోసం మహిళలు పోరాడాల్సిన పరిస్థితులు దేశంలో ఉండటం విచారకరమన్నారు. సనాతనం పేరుతో ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహిళల హక్కులను హరించే పద్ధతులు అవలంభిస్తున్నాయన్నారు. సమానత్వం, మహిళా హక్కుల కోసం ఐద్వా సాగిస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉద్యమాలకే కాకుండా సామాజిక పురోగతికి పెట్టింది పేరన్నారు. ఐద్వా తొలి మహాసభలోనూ అనంతపురం జిల్లా నుంచి నలుగురు సభ్యులు హాజరయ్యారని ఆమె గుర్తుచేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మనువాద విధానాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షురాలు పద్మావతి, వీకే పద్మ, లలితకళాపరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ, డాక్టర్ ప్రసూన, ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక పాల్గొన్నారు.

సమాజాన్ని కాపాడుకోవాలి

సామాజికవేత్త తీస్తా సెతెల్వాద్

అనంతపురం టౌన్(ఆంధ్రజ్యోతి): వామపక్షాలు, దళిత సంఘాలు, అభ్యుదయవాదులు బాధ్యతగా మెలిగి ప్రొటోఫాసిస్టు ప్రభుత్వం నుంచి సమాజాన్ని కాపాడుకోవాలని, అందుకోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముందని సామాజికవేత్త తీస్తా సెతెల్వాద్ అన్నారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం అనంతపురంలోని క్రామేడ్ రబియాబీ ప్రాంగణంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. లలితకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ అధ్యక్షత వహించారు. ఐద్వా సీనియర్ నాయకురాలు వడ్డుపల్లి నాగమ్మ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఐద్వా పోరాటయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో తీస్తా సెతెల్వాద్ మాట్లాడుతూ, దేశంలో ప్రజా స్వేచ్ఛ, హక్కులపై దాడి జరుగుతోందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేని బీజేపీ నేడు దేశంలో పాలన సాగిస్తోందని అన్నారు. సీఏఏ, ఎన్ఆర్సీ చట్టాలను తీసుకువచ్చి పౌరహక్కులను హరిస్తోందని విమర్శించారు. అస్సాం, బెంగాల్, మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడులు వర్ణనాతీతం అని అన్నారు. దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, మితవాదంవైపు ప్రయాణం చేస్తోందని అన్నారు. వాట్సాప్ ఫ్యాక్టరీ సమాజంలో పెనుప్రమాదం సృష్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ, మతోన్మాద ప్రచారాలు మన కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలను మళ్లీ బ్రిటీష్ కాలంనాటి వలస జీవన విధానంలోకి నెట్టివేస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. సభాధ్యక్షురాలు గాజుల పద్మజ మాట్లాడుతూ, అనంతపురం జిల్లా పేరుకు కరువు జిల్లా అయినా, ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పంచడంలో అగ్రస్థానంలో ఉందని అన్నారు. మహిళలకు రాజకీయం, ఆర్థిక రంగాలలో సమాన హక్కులకోసం ఐక్యపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని అన్నారు. నేడు మహిళలు పొందుతున్న హక్కులు నాటి ఐద్వా మహిళా సమాఖ్యల పోరాట ఫలితమేనని అన్నారు. కానీ దేశంలో నేడు కొత్తగా మహిళా సంఘాలు పుట్టుకొస్తున్నాయని, అవేవీ మహిళల కోసం, సమాజంకోసం పనిచేస్తున్న దాఖలాల్లేవని అన్నారు. 2023లో నారీశక్తి పేరుతో మహిళా రిజర్వేషన్ తెస్తామని కేంద్రం చెప్పినప్పటికీ నేటికీ తేలేదని అన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న సామాజికవేత్త తీస్తా సెతెల్వాద్

క్రైం కార్నర్

కౌలు రైతు ఆత్మహత్య


సోమశేఖర్ (ఫైల్)

నంబులపూలకుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డిపల్లికి చెందిన కౌలు రైతు సోమశేఖర్(24) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. సోమశేఖర్‌కు సొంత పొలం లేదు. మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేశారు. రెండేళ్ల నుంచి వరుసగా నష్టపోయాడు. పెట్టుబడికి, కుటుంబ ఖర్చులకు చేసిన రూ.7.50 లక్షల అప్పు భారంగా మారింది. దిక్కుతోచక ఆదివారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. సోమశేఖర్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వలీబాషా తెలిపారు.

చేనేత కార్మికుడు..


కొండప్ప (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు సింగనమల కొండప్ప(51) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు, శాంతినగర్‌కు చెందిన కొండప్ప రెండు మగ్గాలు ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ముడిసరుకుల ధరలు పెరగడం, నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడులు, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలకు రూ.35 లక్షల దాకా అప్పు చేశారు. వాటిని తీర్చే మార్గంలేక సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. ఆయనకు భార్య వరలక్ష్మి, బీటెక్ కుమారుడు బాలాజీ, కూతురు మీనాక్షి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

హంద్రీనీవా కాలువలో పడి వ్యక్తి గల్లంతు


నాగభూషణం

ఆత్మకూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు గ్రామ సమీపాన సోమవారం అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం హంద్రీనీవా కాలువలో పడి గల్లంతయినట్లు పోలీసులు తెలిపారు. బెళుగుప్ప మండలం జీడిపల్లిలో బంధువుల కర్మకాండకు వెళ్లి స్వగ్రామానికి తిరుగు పయనమయ్యాడు. కాలువలో స్నానానికి వెళ్లి కాలుజారి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఫోన్‌పే చెయ్.. పింఛన్ ఇప్పిస్తా..!

● దివ్యాంగులకు ఓ మోసగాడి ఫోన్‌కాల్

రామగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వికలాంగత్వం ఎక్కువగా ఉండి పింఛన్ రావాలంటే తనకు డబ్బు పంపాలంటూ ఓ వ్యక్తి మండలంలోని పలువురు దివ్యాంగులకు ఫోన్ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు దాదాపు 10మందికిపైగా ఫోన్ చేసి తన పేరు శివ అని, కలెక్టర్ ఆఫీసులో పని చేస్తున్నానని చెప్పి, డబ్బు వసూళ్లకు పూనుకున్నట్లు సమాచారం. చెన్నేకొత్తపల్లిలో దివ్యాంగుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వెళ్లినప్పుడు మీ పర్సెంటేజీ తగ్గించారని, దీంతో పింఛన్ రాదని, పర్సెంటేజీ ఎక్కువగా వేయాలంటే రూ.25వేలు తనకు ఫోన్‌పే చేయాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. ఇప్పుడు మీవద్ద ఎంత ఉంటే అంత పంపండి. మిగతాది తర్వాత చూద్దాం అంటూ బేరసారాలకు దిగుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. మరికొందరికి ఫోన్ చేసి మీ పింఛన్ నెలకు రూ.15వేలు వచ్చేలా చేస్తానని, దానికి ఖర్చు ఎక్కువ అవుతుందని, అయితే అది ఇప్పుడు కాదు మళ్లీ నెలలో చేస్తానని చెప్పినట్లు తెలిసింది. ఆయన మాయ మాటలకు మోసపోయిన ఒకరిద్దరు డబ్బులు ఫోన్‌పే చేసినట్లు సమాచారం. ఇతడికి ఫోన్ చేస్తే శివ ఏఎస్‌ఏ, పీటీపీ అని ట్రూకాలర్‌లో వస్తోందని, ఫోన్‌పే చేయాలంటే సాకే శివయ్య అని వస్తున్నట్టు బాధితులు తెలిపారు. ఇతడి గురించి కలెక్టర్ ఆఫీసులో విచారించగా ఆ పేరు గల వ్యక్తి లేరని తెలిసిందన్నారు. దీనిపై రామగిరి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పందుల అపహరణ.. అడ్డుకున్న వారిపై దాడి

గుత్తి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తురకపల్లి రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి పందులను దొంగలు అపహరించారు. అడ్డుకున్న పందుల యజమాని నారాయణస్వామిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. గుర్తుతెలియని ఐదుగురు దుండగులు బొలెరో వాహనంలో వచ్చి తురకపల్లి రోడ్డులో ఉన్న పందులను అపహరించారు. అడ్డుకోపోయిన నారాయణస్వామితోపాటు మరికొంతమందిపై రాళ్లతో దాడి చేశారు. పది పందులను అపహరించుకెళ్లారని బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాళ్ల దాడిలో అక్కడే ఉన్న మత్స్యకారుడికి చెందిన రెండు వ్యాన్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ

గార్లదిన్నె, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన వైకుంఠవాసుడి దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు.. కృష్ణాపురం గ్రామ సమీపంలో రెండు నెలలు క్రితం వైకుంఠవాసుడి దేవాయం నిర్మించారు. ఆదివారం రాత్రి దుండగులు దేవాలయంలోకి చొరబడి హుండీ తాళం పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు రూ. 20వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా తెలిపారు.

గంజాయి స్వాధీనం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక హనుమాన్ సర్కిల్‌లో ఇద్దరు వ్యక్తుల నుంచి నాలుగు కిలోల ఎండు గంజాయిను సోమవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం. శ్రీరామ్ మాట్లాడుతూ.. హనుమాన్ సర్కిల్‌లో తిరునగరి మోహన్‌సుందర్, సాయికుమార్ ద్విచక్రవాహనంలో ఎండు గంజాయిని తరలిస్తుండగా తమ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారని అన్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ శివసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.18

అనంతపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.18తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ భీముని నాయక్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 52 శాతం మార్కులు పొందినవారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 15వ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. పుట్లూరు మండలంలో ఓ మోస్తరు వర్షం పడింది. అనంతపురం, గార్లదిన్నె, శింగనమల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఆదివారం గుత్తి, పామిడి, యల్లనూరు మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

మమ్ములనూ బదిలీ చేయండి..

● దొడ్డిదారి బదిలీలపై టీచర్ల ఆశలు
● ఇద్దరికి అవకాశంతో పైరవీలు ప్రారంభం
● సిఫార్సు లేఖల కోసం నేతల వద్దకు పరుగులు
● ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా వ్యవహారం



అనంతపురంవిద్య, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇద్దరు టీచర్లకు రహస్య బదిలీ చేయడంతో మిగతా వారిలో ఆశలు రేగాయి. దొడ్డిదారి బదిలీలకు ఎత్తులు వేస్తున్నారు. 'వారికి చేశారు కాబట్టి, తమకు కూడా చేయాల'ని కోరుతున్నారు. ఆ మేరకు తమ అనుకూల నేతలను వెంటబెట్టుకుని ప్రజాప్రతినిధుల వద్దకు సిఫార్సు లేఖల కోసం క్యూ కడుతున్నారు. 'మన వారేననీ, ఎలాగైనా దొడ్డిదారి బదిలీకి అవకాశం కల్పించాలనీ, పైస్థాయిలో కూడా చెప్పాల'ని నాయకులు.. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇద్దరు బదిలీ ఆర్డర్లు ఎంతటి రచ్చకు దారి తీస్తాయోనన్న చర్చ సాగుతోంది.

అప్పట్లో జరిగిపోయింది..

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా దొడ్డిదారి బదిలీలు చేశారు. అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బంధువులు పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేసి, బదిలీలు చేయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. గతేడాది కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఆ దొడ్డిదారి బదిలీలను రద్దు చేసింది. ఆ తర్వాత అలాంటి ట్రాన్స్‌ఫర్లకు అవకాశమే లేకుండా చేసింది. ప్రత్యేక చట్టమే తీసుకొచ్చింది. దీంతో ఏడాదిన్నరగా దొడ్డిదారి బదిలీల ఊసే లేకుండా పోయింది. దీంతో టీచర్లు.. ఆ ఆశలు వదులుకున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం దొడ్డిదారిలో ఇద్దరు టీచర్లను బదిలీ చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ స్కూల్ నుంచి జిల్లా కేంద్ర సమీప మండలానికి ఓ టీచర్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో పనిచేస్తున్న ఓ టీచర్‌ను కదిరి నియోజకవర్గంలోని ఓ మండలానికి నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ఆ వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం గోప్యంగా అమలు చేసింది. పాత పాఠశాలలో రిలీవ్ చేయించి, కొత్త బడుల్లో చేర్పించారు. ఆ తర్వాత ఆర్డర్లు వచ్చాయని, వారిద్దరు జాయిన్ అయ్యారని టీచర్లలో పెద్దఎత్తున ప్రచారం సాగింది. విషయం బయటకు పొక్కి, జిల్లాలోని ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లింది. ఒకరిద్దరు నేతలు నేరుగా డీఈఓ కార్యాలయానికి ఫోన్ చేసి, బదిలీ ఆర్డర్లు ఎలా వచ్చాయని ఆరాతీశారట. ఈ బదిలీలతో ఇంతవరకు దూరప్రాంతాల్లో పనిచేస్తూ మౌనంగా ఉంటూ వస్తున్న టీచర్లలో దొడ్డిదారి బదిలీలపై ఆశలు మొలకెత్తాయి.

సిఫార్సు లేఖల కోసం పరుగులు

రెండు బదిలీ ఆర్డర్లు.. రాజకీయ నేతలను నిద్రపోనీయడం లేదు. పలువురు తమ బంధువులు, అనుకూలమైన నేతలను వెంటబెట్టుకుని ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు పరుగులు పెడుతున్నారట. రెండు బదిలీ ఆర్డర్లు వచ్చాయని, తమ వారికి కూడా లేఖలు ఇచ్చి.. పైన చెప్పి ట్రాన్స్‌ఫర్ చేయించాలంటూ ఒత్తిడి పెడుతున్నారట. కీలకమైనవారు వచ్చి అడిగితే కాదనలేక ప్రజాప్రతినిధులు లేఖలు ఇచ్చి పంపుతున్నారని సమాచారం. వాటిని తీసుకొని టీచర్లు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నారు. ఆ రెండు బదిలీలు చేశారు కాబట్టి, తమవారికి కూడా చేయాలని అడగండని నేతలపై అనుకూలురు ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో దొడ్డిదారి బదిలీలు ఎంత రచ్చకు దారితీస్తాయోనని ఇటు నేతలు.. అటు టీచర్లలో చర్చ సాగుతోంది.

కాకర్ల బ్రదర్స్‌ను సస్పెండ్ చేస్తున్నా: జేసీపీఆర్


మాట్లాడుతున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాకర్ల సోదరులను తెలుగుదేశం పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. తాడిపత్రి పట్టణంలో పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల విస్తృత సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న నియోజకవర్గాల్లో వైసీపీ హయాంలో ఒక్క తాడిపత్రి మున్సిపాలిటీనే టీడీపీ గెలిచిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబం తాడిపత్రిలో ఉన్నంత బలంగా ఎక్కడా లేదనేందుకు ఆ గెలుపే నిదర్శనమని అన్నారు. పిలుపునిచ్చిన ఐదు నిమిషాల్లో ఒక్కచోటకు చేరే టీడీపీ శ్రేణులున్న నియోజకవర్గంలో తాను ఉండటం గర్వంగా ఉందని అన్నారు. ఇక్కడి ప్రజలు తనకు దేవుళ్లని, వారు లేనిదే నియోజకవర్గంలో తాను లేనని భావోద్వేగానికి గురయ్యారు. ఇలాంటి టీడీపీ కుటుంబంలో మచ్చ తెచ్చే వ్యక్తులు ఉంటే పార్టీకి చెడ్డపేరు వస్తుందని, అందుకే మీ అభీష్టం మేరకు వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నానని కార్యకర్తలతో అన్నారు. అన్నదమ్ములైన కాకర్ల రంగనాథ్, కాకర్ల జయుడు, కాకర్ల రంగనాయకులుతో ఇకపై పార్టీకి ఎటువంటి సంబంధం లేదని అన్నారు. పార్టీకి సంబంధించి వారు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని అన్నారు. టీడీపీలో ఉండి వైసీపీలోకి వెళ్లడం, వైసీపీలో నుంచి టీడీపీలోకి వచ్చి వైసీపీ కోవర్టులుగా ఉండటం సరికాదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి వీరు సహకరిస్తున్నారని, అంతర్గత వ్యాపారాలు చేస్తూ కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వీరివల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందనే ఆలోచనతో ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌కు కార్యకర్తలు మెమొరాండం ఇచ్చారని అన్నారు. రాష్ట్ర నాయకులకు కూడా పంపించారని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడా పార్టీకి నష్టం జరగకూడదన్న ఉద్దేశంతో నాయకులు, కార్యకర్తల నిర్ణయం మేరకు ఈ సభావేదిక పైనుంచి వారిని సస్పెండ్ చేస్తున్నామని ప్రకటించారు.

ఓలాకు అక్షింతలు

● రూ.80,499 కట్టినా.. బైక్ ఇవ్వలేదని వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు
● వడ్డీతో చెల్లించాలని తీర్పు

అనంతపురం క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డబ్బు కట్టించుకుని బైక్ డెలివరీ చేయని ఓలా కంపెనీపై జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసి, వడ్డీతో సొమ్ము చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత సోమవారం తీర్పు వెలువరించారు. కళ్యాణదుర్గం మండలం భట్టువానిపల్లికి చెందిన నాగరాజు గతేడాది ఏప్రిల్ 19న ఓలా బైక్ కోసం రూపే క్రెడిట్ కార్డు ద్వారా రూ.80,499 చెల్లించారు. కంపెనీ సదరు కస్టమర్‌కు వాహనాన్ని డెలివరీ చేయలేదు. ఆయన పలుమార్లు ఫోన్లు చేసినా, ఈ-మెయిల్స్ పంపినా స్పందించలేదు. దంతో విసిగిపోయిన అతడు.. గతేడాది అక్టోబరు 18న కంపెనీకి నోటీసు ఇచ్చి, వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణకు హాజరైన కంపెనీ ప్రతినిధులు తమకు కస్టమర్ నుంచీ ఆన్‌లైన్‌లో డబ్బు రాలేదంటూ, మళ్లీ చెల్లించాలంటూ కొత్త వాదనను తెరపైకి తీసుకొచ్చారు. క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించినట్టు బ్యాంకు ఖాతా వివరాలను వినియోగదారుడు. కమిషన్ ముందు ఉంచాడు. దీంతో కంపెనీ ప్రతినిధుల వాదనను జిల్లా వినియోగదారుల కమిషన్ అంగీకరించలేదు. కంపెనీ సేవల లోపం ఉన్నట్టు గుర్తించింది. కస్టమర్‌కు రూ.80,499 మొత్తాన్ని 9 శాతం వడ్డీతో గతేడాది ఏప్రిల్ 19వ తేదీ నుంచీ చెల్లించాలని తీర్పు ఇచ్చింది. మానసిక వేదనకు రూ.20 వేలు, న్యాయ వ్యయాల కోసం మరో రూ.5 వేలు తీర్పు ఇచ్చిన తేదీ నుంచీ 45 రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది.

వీసా దొరికితే ఇవ్వండి

● ఓ విద్యార్థి వేడుకోలు


పోగొట్టుకున్న ఐడెంటిటీ కార్డు నమూనా

గుడిబండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వీసా, పాస్‌పోర్ట్ ప్రయాణంలో ఎక్కడో పడిపోయాయని, ఎవరికైనా దొరికితే తెలియజేయాలని మండలంలోని మోరుబాగల్‌కు చెందిన విద్యార్థి సుకృత్ సోమవారం ఓ ప్రకటనలో వేడుకున్నాడు. ఐదు రోజుల కిందట మోరుబాగల్ నుంచి హిందూపురానికి డ్రైవింగ్ టెస్ట్ కోసం వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో వాలెట్ పోగొట్టుకున్నాడు. అందులో జార్జియా దేశం వీసా, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, స్టూడెంట్ ఐడీ, ఏటీఎం కార్డులు ఉన్నట్లు బాధితుడు తెలిపాడు. ఈనెల 23న జార్జియా దేశానికి ఫ్లైట్ టికెట్ కూడా బుక్ చేసుకున్నానని, తన విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎవరికైనా తన వాలెట్ దొరికితే 8328486900, 9182111958, 9182651902లకు సమాచారం అందించాలని విన్నవించాడు.

ఆస్తి కోసం అమ్మనే చంపేశాడు


● కదిరిలో దారుణం ● వేర్వేరుచోట్ల ఇద్దరు యువకుల హత్య

కదిరి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం అమ్మనే చంపేశాడు ఓ కొడుకు. జిల్లాలో వేర్వేరుచోట్ల ఇద్దరు యువకులను హత్య చేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు ముగ్గురిని చంపేశారు. కదిరిలోని నిజాంవలి కాలనీలో ఒంటరిగా నివసిస్తున్న షేక్ ఖాసీంబీ(65)ని ఆమె కుమారుడు షేక్‌బాబా ఆదివారం రాత్రి హత్య చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖాసీంబీకి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. కుమారుడు భార్యను వదిలేసి మరో మహిళతో సహజీవనం చేస్తూ నంద్యాల జిల్లా శ్రీశైలంలో ఉంటున్నాడు. రెండు రోజుల కిందట కదిరిలో ఉన్న తల్లి వద్దకు వచ్చి ఆస్తి ఇవ్వాలని అడిగాడు. దీనికి ఆమె తనను చంపి ఆస్తి తీసుకోవాలని చెప్పింది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి షేక్‌బాబా.. తల్లి ఖాసీంబీని కత్తితో పొడిచి హత్య చేశాడు. ఉదయమైనా ఖాసీంబీ బయటకు రాకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి ఇంట్లోకి చూశారు. రక్తపు మడుగులో ఆమె పడి ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ హత్యాస్థలాన్ని పరిశీలించారు. షేక్‌బాబాపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో గొడవ.. హత్య

గుంతకల్లు టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో తలెత్తిన గొడవలో ఆనంద్ అలియాస్ బొంబాయి(30) అనే యువకుడిని హత్య చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన ఆనంద్, సలీం స్నేహితులు. ఆదివారం రాత్రి ఇరువురు బస్టాండు ఆవరణలో మద్యం తాగారు. ఆనంద్ మద్యం మత్తులో సలీం, అతడి కుటుంబసభ్యులను దూషించాడు. సలీం కోపంతో ఆనంద్‌ను కొట్టాడు. అతడు కిందపడిపోయాడు. అతడి తలపై బండరాయి వేశాడు. దీంతో ఆనంద్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు.. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. హత్యాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనంద్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆనంద్‌కు వివాహం కాలేదు. జులాయిగా తిరుగుతుండేవాడు.

హత్య చేసి.. దహనం


పవన్‌కుమార్ (ఫైల్)

హిందూపురం: యువకుడిని హత్యచేసి కాల్చేసిన ఘటన మండలంలోని సంతేబిదనూరు వద్ద జరిగింది. రూరల్ సీఐ జనార్దన్ తెలిపిన మేరకు సంతేబిదునూరు సమీపంలో కల్లుదుకాణం నిర్వహించే ప్రాంతంలో కాల్చివేసిన శవం ఉందని సోమవారం తెలిసిందన్నారు. దీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. హత్యచేసి మృతుడిని గుర్తుపట్టకుండా ఉండటం కోసం ఖాళీ వాటర్ బాటిల్ వేసి నిప్పంటించినట్లు తెలిపారు. దీంతో మొహం మాత్రం కాలిపోయిందన్నారు. కల్లుదుకాణ నిర్వాహకుడిని ప్రశ్నించగా మృతుడు కర్ణాటకకు చెందినవాడని తెలిపాడు. దీంతో గౌరీబిదునూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతుడు గౌరీబిదునూరులోని హనుమంతనగర్‌కు చెందిన పవన్‌కుమార్ (28)గా గుర్తించారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని గుర్తుపట్టారు. దీనిపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

ఎక్స్‌కవేటర్‌కు రూ.45లక్షల జరిమానా


జరిమానా విధించిన ఎక్స్‌కవేటర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వే బిల్లు సరిగా లేకుండా అంతర్రాష్ట్ర రవాణా చేస్తున్న ఎక్స్‌కవేటర్‌కు పన్నుల శాఖ అధికారులు రూ.45 లక్షల జరిమానా విధించారు. ఒకే వాహనంపై ఇంత మొత్తంలో జరిమానా విధించడం ఇదే మొదటిసారని పన్నుల శాఖ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. పది రోజుల కిందట అధికారులు, సిబ్బందితో కలిసి అనంతపురం-1 సర్కిల్‌లో పనిచేస్తున్న డీసీటీఓ మోహన్ భరత్‌కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఇదే సమయంలో తమిళనాడు నుంచి గుజరాత్‌కు ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్తున్న ట్రక్కును గుర్తించి, తనిఖీ చేశారు. వే బిల్లు సరిగా లేకపోవడంతో వివరాలపై ఆరా తీశారు. తప్పుడు పత్రాలను గుర్తించి రూ.45లక్షలు జరిమానా విధించారు. సంబంధిత యజమానులు సోమవారం ఆ జరిమానా మొత్తం చెల్లించి వాహనం తీసుకెళ్లారు. కాగా వాహనం ఖరీదు రూ.70లక్షలు కావడం గమనార్హం. భరత్ మోహన్ కుమార్ ఆగస్టులో ఎన్‌హెచ్-44 రహదారిపై సరైన పత్రాలు లేని కారణంగా ఓ మిషనరీ తరలిస్తుండగా రూ.30 లక్షలు జరిమానా విధించారు. రెండు నెలల వ్యవధిలో రూ.75 లక్షల పైగా జరిమానా విధించిన డీసీటీఓను పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ హేమ అభినందించారు.

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-19 హ్యాండ్‌బాల్, ఖో-ఖో బాలబాలికల జట్లను సోమవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. బాలికల జట్టులో అర్చన, రక్షిత, సుస్మిత, నాగరత్న, గంగమ్మ, హాసిని, లక్ష్మి, గురువర్షిణి, హరిణి, జనప్రియ, నందిని, ఉమా, అక్షయ, రీతూ, బృందా, హర్షిత, శ్రీహస్త, బాలురలో అభిషేక్, అర్జున్, పవన్‌కుమార్, తరుణ్, పునీత్‌కుమార్, దేవేంద్ర, హిమేష్, శివశంకర్, అభిరాం, సూర్యతేజ, ఉదయ్‌సాయి, జగన్మోహన్, లిఖిత్, లోవరాజు, వర్ధన్, జాఫర్ చోటు దక్కించుకున్నారు. ఖో-ఖో బాలికల జట్టుకు స్వప్న, సోనిక, దానేశ్వరి, అంజలి, లలిత, హరిణి, భవ్యశ్రీ, శ్వేత, ప్రావణి, సంధ్య, జయశాలిని, మౌనిక, బాలురలో నందకిషోర్, కార్తీక్, అనీల్‌కుమార్, హరికృష్ణ, దేవేంద్ర, నరేంద్ర, చరణ్, సందీప్, పురణ్‌చంద్ర, గణేష్‌కుమార్, జైకృష్ణ, హర్ష ఎంపికయ్యారు. ఆయా జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, మురళి, మారుతి, శ్రీధర్, రమేష్, రాజమ్మ, రాజశేఖర్‌రెడ్డి, రాజేష్, సంజీవరాయుడు, శాప్ కోచ్ ఆలీ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

ఆంధ్రా క్రికెట్ అండర్-23 జట్టులో కమిల్



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అండర్-23 క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన కమిల్‌కి చోటు దక్కింది. గుంతకల్లుకు చెందిన కమిల్ ఈ సీజన్‌లో ఆడిన ఆట ప్రతిభ ఆధారంగా ఏసీఏ అండర్-23 జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 16వతేదీ నుంచి అనంతపురంలో నిర్వహించే బీసీసీఐ కోల్ సీకే నాయుడు ట్రోఫీలో ఢిల్లీతో తలపడే ఆంధ్రా క్రికెట్ జట్టు తరఫున కమిల్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఆంధ్రా జట్టులో చోటు సాధించిన కమిల్‌కు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

ప్రధాని సభకు అనంత బందోబస్తు

● జిల్లా నుంచి సుమారు 350 మంది పోలీసులు

అనంతపురం క్రైం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో బందోబస్తు కోసం అనంతపురం నుంచీ పలువురు పోలీసులను నియమించారు. వారంతా సోమవారం బయలుదేరి వెళ్లారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం కర్నూలులో భారీగా నిర్వహించనున్నారు. ఈనెల 16న కర్నూలులో రోడ్ షో తోపాటు, ఓర్వకల్లు మండలంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీంతో బందోబస్తు కోసం అనంతపురం జిల్లా నుంచీ ఇద్దరు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 21 మంది ఎస్‌ఐలు, 300 మందిపైచిలుకు కానిస్టేబుళ్లు, ఇతర అధికారులను నియమించారు. ఈనెల 16వతేదీ వరకూ వారు అక్కడ విధుల్లో పాల్గొంటారు.

హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

గుంతకల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉత్తర రైల్వేలోని జమ్మూతావి రైల్వే డివిజన్‌లో కొండచరియలు విరిగిపడిన కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను నవంబరులో రద్దుపరచనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. తిరుపతి-జమ్మూతావి ఎక్స్‌ప్రెస్ (నం. 22705) రైలును నవంబరు 4వ తేదీ నుంచి, దాని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22706)ను నవంబరు 7 నుంచి చేస్తున్నామన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఈ రైలును నిరవధికంగా రద్దుచేసినట్లు వివరించారు.

సదరం క్యాంపులు వాయిదా: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో అనంతపురం, నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల్లో జరగాల్సిన సదరం క్యాంపులు వాయిదా వేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16 తేదీలలో జరగాల్సిన సదరం క్యాంపులపై ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ పద్మావతి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ తేదీలలో సదరం క్యాంపులకు హాజరు కావాల్సిందిగా ఇదివరకే నోటీసులు పొందిన పింఛనుదారులు వాయిదాను గమనించాలని సూచించారు. సవరించిన షెడ్యూల్‌ను అందరు దివ్యాంగులకు ఎస్ఎంఎస్, ఇతర మార్గాల ద్వారా తెలియజేస్తామన్నారు.

నేడు సెమినార్

కొత్తచెరువు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):'క్వాంటం ఏజ్ అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈఓ కిష్టప్ప ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 9 గంటలకు సెమినార్ ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 9492843184 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఇద్దరు విద్యార్థులను ఈనెల 18న విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక చేస్తామని జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం


స్వామిని దర్శించుకుంటున్న చిలకం మధు

ధర్మవరం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి గ్రామంలో ఇటీవల జీర్ణోద్ధరణ చేసిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాల్లో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సోమవారం హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామస్థులకు అన్నదానం చేశారు.

అధిక ఫీజు వసూలుపై విచారణ

గాండ్లపెంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై డిప్యూటీ డీఈఓ జాన్‌రెడ్డెప్ప సోమవారం తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలోని పాఠశాలల్లో విద్యార్థులతో నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈఓ ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై ఫీజులపై ఆరా తీశారు. తల్లిదండ్రుల నుంచి ఆరాతీసిన వివరాలను కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంఈఓ కృష్ణ నాయక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులుపాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన పరిటాల శ్రీరామ్



ధర్మవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ రాష్ట్ర ఎక్సైజ్ గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ను విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించి పలు అంశాలను పరిటాల శ్రీరామ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు పరిటాలశ్రీరామ్ తెలిపారు.

ఏబీవీపీ పట్టణ కమిటీ ఎంపిక

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పట్టణ నూతన కమిటీని ఎంపిక చేశారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచారప్రముఖ్ వివేకానంద, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వాసుదేవ్ ఆధ్వర్యంలో ఎంపికచేశారు. పట్టణ కార్యదర్శిగా గిరివాల్మీకి, ఉపాధ్యక్షుడిగా అభిషేక్, సంయుక్త కార్యదర్శిగా సాయి, ఖేలో భారత్ కన్వీనర్‌గా జస్వంత్, హాస్టల్ కన్వీనర్‌గా బాలగణేశ్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా అజయ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా చరణ్‌ను ఎంపికచేసినట్లు వారు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

నల్లచెరువు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, ఫీవర్ సర్వే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని విజయలక్ష్మీ కాలనీలో సోమవారం పర్యటించారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. పీహెచ్ఎన్ భారతి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఏఎన్ఎం యోగేశ్వరీ, ఆశా కార్యకర్త కవిత తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతోనే బీమా : ఏఓ

నంబులపూలకుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతు సాగు చేసిన పంట పొలాల్లో పంట కోత ప్రయోగాలు చేయడం ద్వారానే రైతులకు పంట బీమా వర్తిస్తుందని వ్యవసాయాధికారి లోకేశ్వర్‌రెడ్డి, గణాంకాధికారి గంగాధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై ఆర్ఎస్‌కే సిబ్బందికి సోమవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. అనంతరం ఏఓ గెలిచివారిపల్లి సమీపంలోని రైతు భాస్కర్‌రెడ్డి పొలంలో పంటకోత ప్రయోగంపై ఆర్ఎస్‌కే సిబ్బందికి వివరించారు. ఈ నెల 25లోగా పంటకోత ప్రయోగాలు పూర్తి చేయాలని సూచించారు.

మామిడిని చీడపీడల నుంచి కాపాడుకోవాలి

● నంబులపూలకుంట: మామిడితోటలను చీడపీడల నుంచి కాపాడుకుంటే మంచి దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెలిచెలమల గ్రామంలో సోమవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తోటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. వ్యవసాయాధికారి లోకేశ్వర్‌రెడ్డి, ఎఫ్ఈఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ మునిసుధ, సుభాషిణి, మహేష్‌నాయక్, రాధ, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టకిందపల్లికి చెందిన ఓబుళపతి అనే వ్యక్తి విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గుట్టకిందపల్లికి చెందిన ఓబుళపతి కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఇంటి విషయంలో భార్యతో గొడవపడి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. కేతిరెడ్డికాలనీ వద్ద విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతడిని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కింద పడి వృద్ధురాలికి గాయాలు

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ రైల్వే గేటు వద్ద సోమవారం ఓ వృద్ధురాలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు కిందకు పడి తీవ్రంగా గాయపడిందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన వెంకటలక్ష్మి మతిస్థితిమితం సరిగా లేక తిరుగుతుండేది. ఈ క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ఓబులదేవరచెరువు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ్‌కుమారి పేర్కొన్నారు. మండలపరిధిలోని దాదిరెడ్డిపల్లిలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. 30 రకాల వంటలు, కాయలు, ఆకుకూరలు ప్రదర్శించారు. పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, షమీమ్, స్వర్ణ, సునంద, వెంకటనరసమ్మ, పార్వతి, సుకన్య పాల్గొన్నారు.

ఈతోడులో పైప్‌లైన్ లీకేజీ

● వృథాగా రోడ్లపై పారుతున్న తాగునీరు
● మురుగునీటితో కలిసి దుర్వాసన
● ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు


నీటి పైపునకు చెక్క కొట్టిన దృశ్యం


లీకేజీ వల్ల ఏర్పడిన నీటి గుంత

తనకల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఈతోడు గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ మూడు చోట్ల లీకేజీ అయి, ఆ నీరు రోడ్లపై వృథాగా ప్రవహిస్తోంది. చాలా రోజులుగా ఈ పరిస్థితి నెలకొన్నా గ్రామ పంచాయతీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అలాగే ఇళ్లలోని మురుగునీటిని రోడ్ల పైకి వదిలేస్తున్నారు. ఈ కారణంగా ప్రతి రోజు గ్రామంలో మహిళలు గొడవలు పడుతున్నారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా వచ్చే నీరు, మురుగునీరు రోడ్లపై నిలువ ఉండి మడుగులను తలపిస్తున్నాయి. దోమలకు నిలయంగా మారి, వృద్ధి చెందుతున్నాయి. అంతేగాకుండా మురుగు నీటి దుర్వాసనను భరించలేకపోతున్నామని స్థానికులు తెలుపుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్న అటు గ్రామ పంచాయతీ అధికారులు కానీ, ఆరోగ్యశాఖ అధికారులు కానీ ఆ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామంలోని యువకులు స్థానిక పంచాయతీ కార్యదర్శి దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఫలితం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నా కార్యదర్శి పట్టించుకోకపోవడంతో తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి నీరు సరఫరా చేసే పైప్‌లైన్‌లు పగిలిపోయి నీరు వృథాగా రోడ్లమీద పారుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి నీరు అందించే బోరు వద్ద ఏర్పాటుచేసిన పైప్‌లైన్‌కు బోల్ట్ బిగించకుండా ఒక చెక్క కొట్టి వదిలేయడంతో నీరు వృథా అవుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అదే విధంగా గ్రామంలో వీధి దీపాలు వెలగకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. పంచాయతీ అధికారులు, సర్పంచ్ పన్నుల వసూలు మీద చూపించే శ్రద్ధలో ఒక్క శాతం కూడా గ్రామాభివృద్ధిపై కనబరచడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో దోమల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.


రోడ్డుమీద పారుతున్న మురుగు నీరు

ప్రేమజంట హల్‌చల్

కదిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ హోటల్‌కు సమీపంలో ప్రేమజంట ఒకటి తప్పతాగి హల్‌చల్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కడపజిల్లా చక్రాయపేట, అన్నమయ్య జిల్లా బి. కొత్తకోటకు చెందిన ఓ వ్యక్తి, మహిళ సోమవారం తెల్లవారుజామున ఓ హోటల్‌కు సమీపంలో స్థానికులతో గొడవపడ్డారు. వారిని అమర్యాదగా మాట్లాడారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారిపై ఆ జంట దురుసుగా ప్రవర్తించింది. పోలీసులు అక్కడకు చేరుకుని వారిద్దరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్ష చేసి మద్యం తాగినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మత్తు దిగిన తరువాత వారు స్థానికులకు, పోలీసులకు క్షమాపణ చెప్పినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ తీగల సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి స్పందన

కొత్తచెరువు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత పోస్టాఫీసు సమీపంలో ఓ ఇంటి ఎదుట 11కేవీ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండేవి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీనిపై 'చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 11వతేదీన వార్తాకథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సోమవారం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేసి విద్యుత్ తీగలను ఎత్తులో ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులకు, ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


తలమర్ల సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గోపాల్‌రెడ్డి

కొత్తచెరువు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తలమర్ల సహకార సంఘం అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులను, కుంటలను నింపుతున్నామని తెలిపారు. రైతు బాగుంటేనేదేశం బాగుంటుందన్న సంకల్పంతో పీఎం మోదీ, సీఎం చంద్రబాబు కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం తలమర్ల చెరువు మరువ వద్ద రైతులతో కలిసి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఐడీసీ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూలశివ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శీన, నాయకులు సామకోటి ఆదినారాయణ, వెంకటరెడ్డి, నరసింహులు, జయచంద్ర, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కేతిరెడ్డి జన్మదిన వేడుకలు


వైసీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న ఆ పార్టీ నాయకులు

ముదిగుబ్బ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని వైసీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ వేడుకలను జరుపుకున్నారు. వైసీపీ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, వేలూరు చంద్రమోహన్, సర్పంచ్ లక్ష్మీదేవి, చంద్రాయుడు, దండు శ్యాం, జయమ్మ, వెంగల్‌రెడ్డి, కృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అంగన్‌వాడీల కృతజ్ఞతలు


ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం ఇస్తున్న అంగన్‌వాడీల యూనియన్ లీడర్లు

కదిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకురాలు మాబున్నీసా తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చడం వల్ల ఎంతో మంది లబ్ధిపొందారని తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు శకుంతల, రమా, లక్ష్మీదేవి, రమణమ్మ, సుశీల, భాగ్య, శారద, ఉమాదేవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● ఆర్డీఓకు ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకుల వినతి

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ ఆర్డీఓను కోరారు. ఆయనతో పాటు చేనేత నాయకులు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్‌కు చేనేతల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. చేనేతల సమస్యలన్నిటినీ పరిష్కరించాలని కోరారు. కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు చెన్నంపల్లి శ్రీనివాసులు, ఆదినారాయణ, శ్రీనివాసులు, శివ, బాలరంగయ్య, రాజ, కేశవ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం పెంచాలి

● కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు నారాయణస్వామి

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మండలం మలకవేముల గ్రామ పొలంలో నేషనల్ హైవే రోడ్డు-42పక్కన గ్రీన్ ఫీల్డ్ రోడ్డు జంక్షన్‌కు భూమి తీసుకుంటున్నారని, అయితే ఆ పొలాల రైతులకు తక్కువధర చెల్లిస్తున్నారని కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు వనం పూల నారాయణస్వామి అన్నారు. ఆ పొలాలకు నష్టపరిహారం పెంచాలని ఆయనతో పాటు రాయలసీమ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు కొట్వాల శ్రీరాములు, టీడీపీ ధర్మవరం పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ ఆర్డీఓ మహేశ్‌ను స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కలిసి విన్నవించారు.

వ్యవస్థను భ్రష్టుపట్టిస్తారా...?

● ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందిపై ఆర్జేడీ ఆగ్రహం

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌లో ఎక్కడైనా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు తేలితే శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని శిశుసంక్షేమశాఖ ఆర్జేడీ రోహిణి హెచ్చరించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆమె సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా మూడు నెలలుగా స్థానిక ఐసీడీఎస్‌లోని అధికారులు, సిబ్బందిపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించడంతో, ఆర్జేడీ తనిఖీకి వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో ముఖ్య అధికారులు, సిబ్బందితో ఆమె వేర్వేరుగా సమావేశమయ్యారు. ఇటీవల కాలంలో స్థానిక ఐసీడీఎస్‌లో అవినీతి, అక్రమాలపై పలు పత్రికల్లో కథనాలు రావడం పట్ల ఆర్జేడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవస్థను భ్రష్టు పట్టించేలా కొందరి పనితీరు ఉందని పద్ధతి మార్చుకోవాలని ఘాటుగా హెచ్చరించినట్టు తెలిసింది. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీలో, పదోన్నతుల విషయంలో కొందరు చేతి వాటం ప్రదర్శించినట్టు ఆరోపణలు రావడంతో సంబంధిత బాధితులను పిలిపించి విచారించినట్టు సమాచారం. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణలో నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఓ అంగన్‌వాడీ కార్యకర్త ఏడాది పాటు విధులకు రాకున్నా జీతాలు, బిల్లులు చేయడాన్ని ఆర్జేడీ తీవ్రంగా పరిగణించనట్టు సమాచారం. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి కానీ పీడీ దృష్టికి కానీతీసుకురావాలన్నారు. ప్రాజెక్టు పరిధిలో వచ్చిన అవినీతిపై సమగ్రంగా విచారణ చేసి తగిన చర్యలు తీసుకునేందుకు ఉపక్రమిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

ట్రాక్టర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ముసుగు మధు

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ట్రాక్టర్ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మసుగుమధు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక గాంధీనగర్ సర్కిల్ నుంచి సీపీఐ ఆధ్వర్యంలో ట్రాక్టర్ కార్మికులు ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ నిరసనలో మధు మాట్లాడుతూ...గతంలో ఇసుక, మట్టిని ప్రభుత్వమే అందించడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తోందని, అయితే సొంత ఇళ్లు, గుడి నిర్మాణాలకు ఇసుక తరలించే ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేస్తున్నారన్నారు. ఈ ప్రాంత నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలించే టిప్పర్లపై చర్యలుతీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం ట్రాక్టర్ కార్మికుల సమస్యలపై ఆర్డీఓ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శులు ఎర్రంశెట్టి రమణ, శ్రీనివాసులు, రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటరమణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, ఆదినారాయణ, మహిళా సమాఖ్య లీడర్లు లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ, ట్రాక్టర్ కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ క్లాప్ మిత్రకు కలెక్టర్ సన్మానం


క్లాప్‌మిత్ర సింగల దొడ్డప్పను సన్మానిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డ్-2025లో భాగంగా ఉత్తమ క్లాప్‌మిత్రగా అవార్డు అందుకున్న సింగల దొడ్డప్పను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఘనంగా సన్మానించారు. కదిరి మండలం బురుగుపల్లి పంచాయతీకి చెందిన క్లాప్‌మిత్ర సింగల దొడ్డప్ప ఈ నెల 6న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా జిల్లా స్థాయి ఉత్తమ క్లాప్‌మిత్రగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకున్నారు. ఆయనను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ పూలమాల వేసి పట్టుశాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీపీఓ సమత, కదిరి ఎంపీడీఓ కే పోలప్ప, బురుగుపల్లి సర్పంచు భాస్కర్, పంచాయతీ కార్యదర్శి పద్మశ్రీ పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యం

విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం డిగ్రీ, బీటెక్ చదువుతున్న ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు రెండు ల్యాప్‌టాపులు, 10 మంది బధిరులకు 10 టచ్‌ఫోన్‌లు, ఒక దివ్యాంగురాలికి వీల్‌చైర్‌ను పీజీఆర్ఎస్ కార్యక్రమం కింద కలెక్టర్ అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పరికరాలను ఉపయోగించుకుని మరింత ఉన్నతంగా రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్చార్జి డీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయసంస్థ సంచాలకులు అర్చన పాల్గొన్నారు.

'ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలి'

కదిరి అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్య మూలపురుషుడు ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిచాలని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు పట్టణంలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. అలాగే నాయీ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నట్లు వారు తెలిపారు. ఆ సంఘం నాయకులు ఈశ్వరయ్య, రమణ, ప్రసాద్, శ్రీరాములు, ఇండ్లూరి కృష్ణ, శివకుమార్, మునికుమార్, లోకేష్, నరేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా ఉద్యోగం ఇవ్వలేదు

● ఓ యువతి ఆవేదన


అర్హత పత్రం చూపుతున్న నదియా

పుట్టపర్తిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలు ఉన్న తన పేరును అర్హత జాబితాలో సూచించారు కానీ ఉద్యోగం మరొకరికి ఇచ్చారని అమరాపురం మండలానికి చెందిన నదియా కలెక్టరేట్ ఎదుట భోరుమంది. ఈ మేరకు ఆమె సోమవారం కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు ఫిర్యాదుచేసింది. అనంతరం ఆమె మట్లాడుతూ... 2024లో కేజీవీబీ నాన్‌టీచింగ్ పోస్టుకు దరఖాస్తు చేసి ఇంటర్వ్యూలో అర్హతసాధించినప్పటికి ఉద్యోగం ఇవ్వలేదని వాపోయారు. అర్హత జాబితాలో పేరు ఉన్నప్పటికి ఇతరులకు ఉద్యోగం ఇచ్చారని తెలిపారు. అకౌంటెంట్ పోస్టుకూ దరఖాస్తు చేసి అర్హత సాధించినా అవకాశం ఇవ్వలేదన్నారు. సర్వశిక్షా అభియాన్ అధికారులు మౌఖిక పరీక్షకు పిలుస్తామని చెప్పి ఇంతవరకు తనను పిలువలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలోనే కలెక్టరుకు పిర్యాదుచేశానన్నారు. ప్రస్తుతం తనకు న్యాయం చేయాలని మరోసారి కలెక్టరుకు ఫిర్యాదుచేసినట్లు ఆమె తెలిపారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్లకు సన్మానం

నల్లమాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్వాతి క్లినిక్ ఆవరణంలో సోమవారం టీడీపీ నాయకు బుట్టి నాగభూషణం నాయుడు ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డ్ డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. ఇటీవల నూతనంగా ఎంపికైన మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు మణికుమారి, జయరాం నాయక్‌ను పూలమాలలతో, దుశ్శాలువతో సన్మానించారు. వారిని ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే సింధూరారెడ్డికి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు బుట్టి నాగభూషణం నాయుడు, నారాయణస్వామి, రమణ, నాగభూషణం, దండోడి భాస్కర్, మిలిటరీ రహిమాన్, జనసేన మండల కన్వీనర్ మహేష్ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు స్వాగతం

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సుందరయ్యనగర్‌లో ఉన్న గణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి, సర్వీస్ రిజిస్టర్లు, యూటీఎఫ్ బ్యాగులను అందజేసినట్టు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి రామకృష్ణానాయక్ తెలిపారు. యూటీఎఫ్ నాయకులు లక్ష్మయ్య, రామకృష్ణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలి

నంబులపూలకుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నూతనంగా విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు గ్రామాలలో పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఎంఈఓ గోపాల్‌నాయక్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో 2025 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు విధుల్లోకి చేరారు. వారిని ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడారు. అనంతరం ఎస్టీయూ రూపొందించిన బుక్లెట్లను వారికి అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి, ఉపాధ్యాయులు శివయ్య, సందీప్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో సత్తాచాటిన విద్యార్థులు



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్, ఉపాధ్యాయులు

ధర్మవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తచాటి స్థానిక యశోద పాఠశాల విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్లు రవీంద్ర, పృథ్వీరాజ్ తెలిపారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 8 వతేదీ నుంచి 13వతేదీ వరకు జరిగిన హ్యాండ్‌బాల్ ఎస్‌జీఎఫ్ బాలుర, బాలికల విభాగాల్లో సత్తచాటారని తెలిపారు. అండర్-14 విభాగంలో పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గిరిచరణ్, మోక్షిత, రాజ్‌నాయక్, అండర్-17 విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న తేజసాయిరెడ్డి, తన్మయ, అండర్-19 విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న హరిణి, జనప్రియ ప్రతిభ కనబరచి అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వారిని పాఠశాల డైరెక్టర్లతో పాటు ప్రిన్సిపాల్ అనూప్, పీఈటీ, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

న్యూస్ బాక్స్

3 నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబరు 3 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం కార్మికులతో కలిసి కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. ఏఐటీయూసీ నాయకులు బాబు, రవి, లింగారెడ్డి, మారుతిరెడ్డి, సురేష్, పాల్గొన్నారు.

రాయల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బలిజ సంఘం నాయకులు

గోరంట్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యాధీశులు శ్రీకృష్ణ దేవరాయల జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బలిజ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని అన్ని రంగాలలోనూ సమర్థవంతమైన పాలన సాగించిన మహానుభావుడి జయంతి, వర్ధంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించడం ద్వారా యువతకు స్ఫూర్తి లభిస్తుందన్నారు. బలిజ సంఘం నాయకులు సంతోష్, గంగాధర్, వేణుగోపాల్, పులేరు హరి, సుందరేశ్, కిషోర్, బాలాజీ, నరేంద్ర, నగేష్, కమలాకర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మద్యం డిపో ప్రారంభం



మద్యం డిపోను పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గోరంట్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం సమీపం బెల్లాలచెరువు రోడ్డులో ఏపీఎస్‌బీసీఎల్ మద్యం డిపోను అనంతపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సోమవారం ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లాలో మద్యం దుకాణాలు బార్ల సౌకర్యార్థం, మద్యం స్టాక్ పాయింట్‌ను ప్రభుత్వం మంజూరు చేయగా, ఇటీవల మంత్రులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న మద్యం దకాణాలు, బార్లకు కొత్తగా ఏర్పాటైన డిపో నుంచి మద్యం సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డిపో మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ డిపో మేనేజర్ నరసింహులు, ఇన్‌స్పెక్టర్ గురునాథ్, సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, మద్యం షాపు యజమానులు ఈడిగ రవి, బోయ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కంది పంటపైనే అన్నదాత ఆశలు



పూతతో ఆశాజనకంగా ఉన్న కంది పంట

మడకశిర రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటకు తెగుళ్ల సోకడంతో దిగుడి వచ్చే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా సాగు చేసిన కంది మాత్రం ఆశాజనకంగా ఉందని రైతులు ఆనందంతో ఉన్నారు. మండల వ్యాప్తంగా 3500 ఎకరాల్లో రైతులు కంది సాగుచేశారు. చాలా మంది రైతులు కంది పంటపైనే ఆశలు పెట్టుకున్నారు.

సీపీఆర్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొళ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వైద్యాధికారి డాక్టర్ బాల ప్రణీత్‌రెడ్డి పాఠశాల హెచ్‌ఎం అధ్యక్షతన విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. హృదయ స్పందన, ఛాతి నొప్పి వచ్చినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్సలపై విద్యార్థులకు వివరించారు. సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆసుపత్రి కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ



డైరీలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పాపిరెడ్డిపల్లి వద్దనున్న కేజీబీవీలో సోమవారం టీడీపీ నాయకులు విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వీటిని అందించారు. ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంఈఓ అంజనేయులునాయక్, ఎస్ఓ అనీత, నాయకులు, రంగేపల్లి వెంకటరమణ, వెంకటేశులు, రామక్రిష్ణ, సంజీవరెడ్డి, భానుకీర్తి, వడ్డెసురేష్, బావయ్య, మహేంద్ర, ఆకుల రమణ, ప్రభాకర్, బాలు, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురం భవిష్యత్తుకు పునాది వేసింది ఎన్టీఆరే

- నా సినిమాల్లో విద్యార్థులకు ఉపయోగపడే సందేశాలు
- చదువు విలువ ఇప్పుడు తెలుస్తోంది
- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



కె. బసవనపల్లిలో అదనపు తరగతి గది భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హిందూపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): హిందూపురం భవిష్యత్తుకు పునాది వేసింది నందమూరి తారకరామారావని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడోరోజు సోమవారం మండలంలోని కె.బసవనపల్లిలో రూ.64లక్షలతో నిర్మించిన అదనపు తరగతిగది, లైబ్రేరీని ప్రారంభించారు. బసవనపల్లి నుంచి లయోలా పాఠశాలకు వెళ్లే రూ.1.5కోట్లతో తారురోడ్డును ప్రారంభించారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పట్టణంలో జరిగిన జీఎస్టీ ర్యాలీలో పాల్గొన్నారు. బసవనపల్లిలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ హిందూపురం ప్రాంతంలో పరిశ్రమలు, నవోదయ పాఠశాల, గురుకుల పాఠశాలలు స్థాపించడంలో ఎన్టీఆర్ తీసుకున్నచొరవ మరువలేనిదన్నారు. ఆ రోజుల్లోనే చదువుపట్ల ఉన్నశ్రద్ధ ఆయనకు ఏపాటిదో అర్థం అవుతుందన్నారు. అంత శ్రద్ధగా చదివేవాడిని కాను, అయినా డిగ్రీపూర్తిచేసి సినీరంగంలోకి వచ్చానన్నారు. చదువు విలువ ఎమిటో ఇప్పుడు తెలుసొచ్చిందన్నారు. తాను తీసే సినిమాల్లో సమాజానికి ఉపయోగపడే సన్నివేశాలతోపాటు విద్యార్థులకు సందేశాలుంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బేవనహళ్లి ఆనంద్ అందించిన క్రీడా పరికరాలను ఎమ్మెల్యే అందజేశారు. వాణిజ్యపన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కరవల్లి, హిందూపురం వాణిజ్యపన్నులశాఖ అధికారి కృష్ణవేణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్‌యార్డ్, చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, నాయకులు నాగరాజు, హెచ్ఎన్ రాము, కొల్లకుంట శివశంకర్, మంజునాథ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం: నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ ఒక్కొక్కటే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పలువురు బాలకృష్ణను కలిశారు. చేనేత కార్మికులు కలిసి 200యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని కోరారు. మరికొంతమంది ఇంటి స్థలాలు, పిం చన్లు, భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్, కన్వీనర్లు రాము, వెంకటేశ్, కార్పొరేషన్ డైరెక్టర్లు, బేవనహళ్లి ఆనంద్, చంద్రమోహన్, పరిమళ, గంగాధర్, నాగరాజు, అమర్నాథ్, డైమండ్‌బాబా, మంజునాథ్, చక్కీరప్ప, రమేష్ పాల్గొన్నారు.



క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలి

మడకశిరటౌన్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంచాయతీరాజ్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న భాష పండిట్‌లను, పీఈటీలను అప్‌గ్రేడ్ చేసిందని, గిరిజన సంక్షేమ స్కూళ్లలో పనిచేస్తున్న వారిని విస్మరించడం బాధాకరమన్నారు. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఏ ఉత్తర్వులు అయినా తక్షణమే అన్ని యాజమాన్యాలకు వర్తించే విధంగా చూడాలని కోరారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం సరికాదు

- వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం అరికట్టాలని, బెల్టుషాపులను తొలగించాలన్నారు. అన్నమయ్య జిల్లా ములకల చెరువులో జరిగిన ఘటనపై పూర్తిగా విచారించి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ మురళీకి వినతిపత్రాన్ని అందజేశారు. రవిశేఖర్‌రెడ్డి, ఆనందరంగారెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు గోదాములు అద్దెకు..

- పీఏసీఎస్ చైర్మన్ జయచంద్ర

సోమందేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద డీసీసీబీ ద్వారా రైతు సంఘాల కోసం నిర్మించిన గోదాములు నిబంధనలకు లోబడి అద్దెకిచ్చినట్లు పీఏసీఎస్ చైర్మన్ జయచంద్ర తెలిపారు. నాబార్డ్ ద్వారా రూ.1.50కోట్ల రుణంతో రెండేళ్ల క్రితం వీటిని నిర్మించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాసహకార అధికారి, ఉన్నతాధికారుల అనుమతులతో ఏపీఎస్‌బీసీఎల్ వారికి అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. వీటి వినియోగంపై రైతులకు అధిక భారం పడనుండటంతో ప్రైవేట్‌వారికి అద్దెకు ఇచ్చామన్నారు. ఇందులో మంత్రి ప్రమేయం లేదని, కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటిఆరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నిజానిజాలు తెలుసుకుని మాట్లాడండి

- ఉష శ్రీచరణ్ వ్యాఖ్యలపై జనసేన ఇన్‌చార్జి కుమార్

పెనుకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మంత్రి సవితను రాజకీయంగా ఎదుర్కొనలేక తన ఉనికి చాటుకునేందుకే వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ చేసిన ఆరోపణలు అసత్యమని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి సవిత తమ స్వగ్రామమైన రాంపురంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటుచేయించి కల్తీ మద్యాన్ని అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని చేసిన ఆరోపణలు అసత్యమన్నారు. రాంపురంలో ఉన్న మద్యం షాపు మా కల్లుగీత కార్మికుల కోటాలో వచ్చిందన్నారు. ఇదే రాంపురంలో వైసీపీ పాలనలో కర్ణాటక మద్యం అమ్మి లక్షలు సంపాదించింది ఎవరంటూ ప్రశ్నించారు. కళ్యాణదుర్గం రాజకీయాలు ఇక్కడ చెల్లవన్నారు. మరోసారి కల్లుగీత కార్మికులను కించపరిస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

నిరంతరాయంగా యూరియా పంపిణీ

అమరాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నిరంతరాయంగా యూరియా సరఫరా చేస్తామని సింగిల్‌విండో అధ్యక్షుడు గణేశ్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో సోమవారం సాయంత్రం యూరియా 12 టన్నులు దిగుమతి చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా అందిస్తామన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం ఆధార్‌కార్డు తీసుకుని వెళ్లి తీసుకోవచ్చన్నారు. మాజీ ఎంపీటీసీ చంద్రప్ప, వసల పంచాయతీ కన్వీనర్ నాగరాజు, మంజునాథ్, నిజాం పాల్గొన్నారు.

సమస్యలపై క్లస్టర్ కో కన్వీనర్ ఆరా

అమరాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పంచాయతీల వారిగా రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ లక్ష్మీనరసింహను క్లస్టర్ కోకన్వీనర్ మంజునాథ్ ఆరాతీశారు. వన్‌బీ, అడంగల్ కరెక్షన్, పాసుపుస్తకాల కోసం వచ్చిన రైతులకు పరిష్కరించాలన్నారు. డీలర్ మోహన్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

అగళి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా 18మంది ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈఓలు కృష్ణమూర్తి రాజు, చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. మధూడి ఉన్నత పాఠశాలకు 8, ఇగనగలూరుకు 4, ఆర్టీపల్లికి 3, మోడల్ స్కూల్‌కు ఒక రెగ్యులర్ ప్రిన్సిపాల్, ఒక సైన్స్ టీచర్, అగళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా విజయకుమారి



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న వేణుగోపాల్, సిబ్బంది

అగళి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా సి.విజయ్‌కుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మోడల్ పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో పాఠశాల నిర్వహణ కొనసాగింది. ఎట్టకేలకు 2025డీఎస్సీలో విశాఖపట్నం నుంచి విజయ్‌కుమారిని రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. సోమవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణుగోపాల్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి అగళికి రావడం ఆనందంగా ఉందని, ఇక్కడ ఉపాధ్యాయ బృందంతో కలిసి మెరుగైన విద్యకోసం పనిచేస్తానన్నారు.

గోపాలమిత్ర బదిలీని ఆపండి

సోమందేపల్లి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లాపల్లి గోపాల మిత్ర దామోదర్‌ను రాజకీయ కారణాలతో బదిలీ చేస్తున్నారని ఆరోపిస్తూ ఆ గ్రామ పాడి రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. 16ఏళ్లుగా సేవలందిస్తూ రైతులకు అండగా నిలిచారన్నారు. ఉన్నఫళంగా బదిలీ చేయడం సరికాదన్నారు. ఆయనను బదిలీ చేస్తే పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

- అర్జీలు ఇచ్చేందుకు వచ్చి వెనుదిరిగిన ప్రజలు

లేపాక్షి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికకు పలుశాఖల అధికారులు డుమ్మాకొడుతున్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్‌ను నిర్వహించారు. మండలంలోని గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవించడానికి ఆయాశాఖల అధికారులు ఉంటారన్న నమ్మకంతో ఎన్నో కష్టాలను ఓర్చుకుని కార్యాలయానికి వస్తున్నారు. సంబంధిత అధికారులు లేకపోవడంతో నిరుత్సాహంగా వెనుతిరుగుతున్నారు. కోట్లరూపాయల నిధులను వెచ్చించి మండలంలో గ్రామీణ ప్రాంతాలకు రోడ్లను వేస్తున్నారు. ఆ శాఖకు సంబంధించి మండల స్థాయి ఇంజనీర్ డుమ్మాకొట్టారు. చెరువుల్లో అక్రమంగా మట్టితోలుతూ కొంత మంది చెరువులను కబ్జాచేసి అక్రమంగా పంటలను సాగుచేస్తున్నా, వాటిని కట్టడి చేయాల్సిన సిబ్బంది సైతం కనిపించలేదు. ఎక్సైజ్‌శాఖ, అటవీశాఖ అధికారులు ఎప్పుడూ డుమ్మాకొడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజా పరిష్కార వేదికకు డుమ్మాకొట్టిన అధికారులపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మండలస్థాయి అధికారులు

సచివాలయాల నిర్వహణ అస్తవ్యస్తం

- సమయపాలన పాటించని ఉద్యోగులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు

మడకశిర రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చింది. అయితే వాటి నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. మండలంలో 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అందులో 131 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రజలు ఎక్కువగా రెవెన్యూ, సర్వే, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీ కార్యదర్శుల కోసం సచివాలయాలకు వస్తుంటారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి నెలకొంది. సచివాలయాలకు ప్రజలు వచ్చి అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుతిరిగి వెళుతున్నారు. సోమవారం గంగళవాయిపాళ్యం సచివాలయంలో కేవలం వెల్ఫేర్ అసిసెంట్ మాత్రమే ఉందుబాటులో ఉన్నారు. డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని తొలగించారు. ప్రభుత్వ సేవలు సచివాలయాలల్లో నమోదు చేసేవారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీఆర్వో లేకపోవడం, సర్వేయర్ ఉన్నా ఎప్పుడు వస్తారో తెలియకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సిబ్బంది లేని జీవీ పాళ్యం గ్రామ సచివాలయం



ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

సమాజ శ్రేయస్సు కోసమే జీఎస్టీ సంస్కరణలు

రొద్దం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాజ శ్రేయస్సు కోసం జీఎస్టీ సంస్కరణలను తీసుకొచ్చాయని టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య అన్నారు. సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై మండల కేంద్రంలోని పురవీధులు, షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. జీఎస్‌టీ తగ్గించిన దృష్ట్యా ప్రజలకు తక్కువ ధరలకు వస్తువులు అందించాలని సూచించారు. నరహరి, చంద్రమౌళి, హరీ, వెంకటరామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు, రామచంద్ర, తిరుపాల్‌నాయుడు, అశ్వత్థనారాయణ, టైలర్ అంజనేయులు, చిరంజీవి, సిద్దన్న, నరసింహులు పాల్గొన్నారు.

మన్రో తోపు ఆక్రమణదారులకు నోటీసులు?



మన్రో తోపులో వెలసిన ఆక్రమణలు

చిలమత్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అధీనంలో ఉన్న కోడూరు మన్రో తోపులో ఆక్రమణలకు పాల్పడిన వారికి పంచాయతీ అధికారులు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిసింది. పచ్చదనానికి మారుపేరుగా ఉన్న తోపులో కొందరు ఇష్టానుసారంగా స్థలాలను కబ్జా చేసుకుంటూ, వాటిని అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో రోడ్డు పక్కన ఉన్న కొందరు దుకాణాదారులతో పాటు పనిలోపనిగా మరికొందరు పక్కా భవనాలను నిర్మించుకునే ఉద్దేశ్యంతో మన్రో తోపుకు చెందిన భూమిలో చదునుచేసి కబ్జాకు పాల్పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు రావడంతో స్పందించిన ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే పీఏ వీరయ్యను మన్రో తోపులో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమన మన్రో ఆక్రమణలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. నేడో రేపో ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

యానిమేటర్‌పై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మహిళా సంఘాల సభ్యులు

రొళ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడ్డబొమ్మనహళ్లి గ్రామానికి చెందిన యానిమేటర్ తిమ్మరాజు మహిళా సంఘం సభ్యులను మోసం చేసి నగదు కాజేశాడని, ఇతనిపై చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు.దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని 15మంది కలిసి మారుతి, ధనలక్ష్మి మహిళా సంఘం ఏర్పాటు చేసుకుని సంఘం ద్వారా రుణాలు తీసుకుని వడ్డీలు సక్రమంగా బ్యాంకులకు చేస్తున్నామన్నారు. రెండేళ్ల క్రితం రెండు సంఘాల యానిమేటర్లు తిమ్మరాజు బ్యాంక్ ద్వారా రుణాలు మంజూరయ్యాయని మీ రుణాలు నేను తీసుకుని అసలు వడ్డీతో సహా బ్యాంకుకు తీరుస్తానని నమ్మించాడన్నారు. చివరికి ఆ సొమ్ముకు తనకు సంబంధంలేదని తమపై దౌర్జన్యానికి దిగుతున్నాడని ఆరోపించారు. స్థానిక పోలీసస్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు ఏఎస్ఐ హిదాయతుల్లా, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం

- పీడీఓ నిర్లక్ష్య వైఖరిపై సభ్యుల నిరసన



పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న సభ్యులు, నాయకులు

పావగడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పీడీఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కోటగుడ్డం గ్రామ పంచాయతీ కార్యాలయానికి సభ్యులు, నాయకులు సోమవారం తాళం వేసి నిరసన తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో పీడీఓగా పనిచేస్తున్న భవ్య సమయానికి రావడం లేదని వారు ఆరోపించారు. దీంతో అనేక గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోందన్నారు. దీనికితోడు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షల వరకు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ సభ్యుడు నవీన్ మాట్లాడుతూ పంచాయతీలో పీడీఓ భవ్య మూడు రోజులకోసారి కార్యాలయానికి వచ్చి వారం రోజులపాటు పనిచేసినట్లు హాజరు పట్టికలో నమోదుచేసి వెళుతున్నారని ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షంతో కడపలకిరే గ్రామంలో దోమల బెడద అధికంగా కావడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని ఎన్నిసార్లు చెప్పినా ఆమె స్పందించడం లేదని ఆరోపించారు. గ్రామస్థులు లింగారెడ్డి, శివకుమార్, నారాయణ, హనుమంతరాయ, మారుతి, పుష్పరాజ్ అనే వ్యక్తులు పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి గ్రామాలలో ఫాగింగ్ చేసేంతవరకు కార్యాలయం తెరవమని భీష్మించారు.

అధికారులకు నగదు అందించా: పీడీఓ భవ్య

గతంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య పర్యటన సందర్భంగా అప్పటి ఈఓ జానకీరామ్‌కు రూ.3లక్షలు పంచాయతీ తరుపున అందించాం. పేరుగాంచిన మరో నాయకుడికి రూ.5లక్షలు ఇచ్చా. నాయకులు ఒత్తిడి చేయడంతో నగదు అందించడం వాస్తవం.

చన్నమల్లయ్యకు దక్కిన కిరీటం

- వరించిన తుమల్ డైరెక్టర్ పదవి



చన్నమల్లయ్య

పావగడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జేడీఎస్ పార్టీ నాయకుడు చెన్నమల్లయ్యకు తుమల్ డైరెక్టర్ పదవి లభించడంతో ఎన్నికల సమయంలో ఆ పార్టీ తరుపున ఇచ్చిన ఎన్నికల గుర్తు కిరీటం పదవి ఆయనకు దక్కినట్లయ్యింది. గత యేడాది జరిగిన తుమల్ డైరెక్టర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, జేడీఎస్ నుంచి చెన్నమల్లయ్య ఎన్నికల బరిలో నిలిచిన విషయం తెలిసిందే తాలూకావ్యాప్తంగా 47 డెయిరీల డెలిగేటెడ్స్ ఓటు హక్కు వినియోగించుకోగా అదనంగా 11మంది నూతన డైరెక్టర్లు వినియోగించుకున్నారు. మొత్తం 58మందిలో 29మంది చంద్రశేఖర్‌రెడ్డికి, 28చెన్నమల్లయ్యకు ఓట్లురాగా ఒక ఓటు ఇన్వాలిడ్ అవ్వడంతో ఒక్క ఓటు తేడాతో చంద్రశేఖర్ రెడ్డి అప్పట్లో గెలుపొందాడు. ఏడు ఓట్లు అనర్హులుగా జేడీఎస్ అభ్యర్థి చెన్నమల్లయ్య కోర్టును ఆశ్రయించడంతో నేడు వచ్చిన తీర్పులో ఏడు ఓట్లు రద్దయి ఉన్న ఓట్లను 15రోజుల్లోగా కౌంటింగ్‌చేసి తీర్పునివ్వాలని కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశించింది. ఇందులో 24ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌కు రాగా 26ఓట్లు చెన్నమల్లయ్యకు వచ్చాయి. రెండు ఓట్లు తేడాతో చెన్నమల్లయ్య గెలిచి కిరీటం దక్కించుకున్నట్లు జెడీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.